PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 6 | విజయవాడ, బుధవారం 6 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 6 August 2025 | Rs

చెంచుల జీవితాల్లో చీకట్లు

- అందని ఆధార్, రేషన్ కార్డులు
- సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు కరువు
- విద్య, వైద్యం, తాగునీరుకూ కష్టాలే

3

ఇంగ్లండ్ టూర్ దిగ్విజయం

టెండూల్కర్ -ఆండర్సన్ ట్రోఫీలో రికార్డుల మోత

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్



8



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

19 నుంచి పి-4

- 2029 నాటికి జీరో పావర్టి లక్ష్యం
- అధికారులు, ప్రజాప్రతినిధులతో చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2029 నాటికి జీరో పావర్టిని సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పి-4 కార్యక్రమంపై ఉన్నతాధికారులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అలాగే ఈ నెల 19వ తేదీ నుంచి పి-4ను ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. మార్గదర్శులు ఇచ్చే చిన్న ఆసరగా బంగారు కుటుంబాలకు కొండంత అండగా మారుతుందని వ్యాఖ్యానిం చారు. ఈ స్ఫూర్తి ధనికుల్లోనే కాకుండా పేదల్లో కూడా కలగడం అభినందనీయమన్నారు. ఆవనిగడ్డకు చెందిన ఒక పారిశుధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత కూడా మార్గదర్శిగా ముందుకు వచ్చారని సిఎం తెలిపారు. ఆమె ఒక వృద్ధురాలిని ఆదుకుంటానని చెప్పారని అన్నారు. డబ్బుతోపాటు సాయం చేసేవారు కూడా మార్గదర్శులేనని అన్నారు. బంగారు కుటుంబాల ను ఆదుకునేందుకు ముందుకువచ్చే మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందంగానే సాగుతున్నట్లు బాబు చెప్పారు. కొంతమంది ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని, గతంలో కూడా జన్మభూమి, శ్రమ దానం, నీరు మీరు వంటి కార్యక్రమాల సమయం లోనూ విమర్శలు చేశారన్నారు. పేదలను ఆదుకునేందుకు పి-4 వేదికగా ఉందన్న విషయాన్ని ప్రచారం చేయాలని సిఎం చెప్పారు. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, వ్యాపార, పారిశ్రామిక వేత్తల్లో కూడా పి-4పై ఆలోచన కలిగించాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ పి-4 అమలు కోసం చేసిన సర్వేలో 31 శాతం మంది ఉద్యోగాలు కావాలనే కోరుకున్నారని తేలినట్లు అధికారులు వివరించారు. అలాగే 22 శాతం మంది వైద్య చికిత్సలకు, తొమ్మిది శాతం మంది చిన్న చిన్న వ్యాపారాలకు చేయూత కల్పించాలని కోరుకున్నట్లు సమీక్షలో వెల్లడించారు. కాగా ఇప్పటివరకు 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించినట్లు అధికారులు వివరించారు. అలాగే 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయిందని చెప్పారు. తాను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సాయం చేసేందుకు కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పి-4 కమిటీ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు

- ప్రజలకు విద్యుత్ భారాల ఉరి : విజయవాడ ధర్నాలో వి.శ్రీనివాసరావు
- తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరిక
- వైసిపి బాటలోనే టిడిపి నడుస్తోందని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్కరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లు, మోపుతున్న విద్యుత్‌భారాలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. ప్రజావేదిక పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరిగిన ధర్నాకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజానీకం పాల్గొంది. స్మార్ట్‌మీటర్లకు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా చేసిన నినాదాలతో సబ్‌స్టేషన్ ప్రాంతాలు మారుమ్రోగాయి. విజయవాడ గాంధీ హిల్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలో పేరుతో స్మార్ట్ మీటర్లు బిగిస్తూ సామాన్య ప్రజలకు పాత, కొత్త బకాయిలు కలిపి ఈ ఒక్క సంవత్సరమే రూ.50 వేల కోట్ల భారాల ఉరి వేశారని అన్నారు. . అదానీ కోసం స్మార్ట్‌మీటర్లు పెడుతూ ఇష్టం వచ్చిన విధంగా బిల్లులు వేస్తున్నారని తెలిపారు. కొత్తగా ట్రూఅప్ ఛార్జీలు రూ.12,771 కోట్లను వినియోగదారులపై రుద్దేందుకు నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ఇష్టం ఉంటేనే మీటర్లు బిగిస్తున్నామని మంత్రి చెబుతుంటూ విద్యుత్ సిబ్బంది గోడలు దూకిమరీ మీటర్లు బిగించి వెళుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. దీన్నే కొనసాగిస్తే ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. ప్రజలపై నమ్మకం, నీతి నిజాయితీ ఉంటే కూటమి ప్రభుత్వం పెంచిన భారాలను వెనక్కు తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పిల్లల ఫీజులు, ఆస్పత్రుల ఫీజుల కోసం అప్పులు చేస్తున్నారని, ఇప్పుడు విద్యుత్ బిల్లుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు. అదానీ కోసం స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, ఆయనపై అమెరికాలో అవినీతి కేసులు ఉన్నాయని, వాటిపై ప్రజలకు సమాధానం చెప్పకుండానే మీటర్లు బిగిస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం లంచాలు తీసుకుందని చెప్పిన టిడిపి నాయకులు ఇప్పుడు అవే మీటర్లను పెట్టడం అవినీతికి పాల్పడటమేనని గుర్తుపెట్టుకోవాలన్నారు. విద్యుత్ వ్యవస్థ మొత్తం అదానీ చేతుల్లో ఉందని, రేపు వారు ఎంత ధరంటే అంత ధరకు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. గతంలో సాధారణ మీటర్లు ఉంటే వాటిని తీసేసి డిజిటల్ మీటర్లు పెట్టారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. అసలు డిజిటల్ మీటర్లను ఎందుకు తీసేయాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం విద్య, విద్యుత్, రెవెన్యూ విభాగాల్లో ఏ పద్ధతిని అయితే అనుసరించిందో అదే విధానాలను తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తోందని, వైసిపి విడిచిన చెప్పులు వేసుకుని నడుస్తోందని విమర్శించారు. ప్రభుత్వాలు ఏవైనా కొత్తసీసాలో పాతసారాలా పాలన ఉందని అన్నారు. భారాలను ఉపసంహరించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రజావేదికకు వామపక్షాల తరుపున మద్దతు ప్రకటించారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కొటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు భారాలు వేయబోమని చెప్పిన టిడిపి నాయకులు ఇప్పుడు ఎందుకు వేశారో చెప్పాలని ప్రశ్నించారు.


అధికారమే పరమావధిగా ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఎఐటియుసి కార్యదర్శి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇదే ధోరణి అనుసరిస్తే బషీర్‌బాగ్ లాంటి మరో ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. ఐఎఫ్‌టియు నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలను తగ్గించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని హెచ్చరించారు. విజయవాడ కార్పొరేషన్ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, నాయకు లు సూరిబాబు, సుబ్బారెడ్డి, సిపిఐ నాయకులు రమణారావు, తాడి పైడియ్య, తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విజయవాడలో కొత్తపేట సబ్‌స్టేషన్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక చేపట్టిన నిరసనోద్యమానికి సంఘీభావం తెలియజేస్తున్న వి శ్రీనివాసరావు

ఉత్తరకాశీలో మెరుపు వరదలు

- నిమిషాల్లో కొట్టుకుపోయిన ధరాలీ
- నలుగురు మృతి, 50 మంది గల్లంతు
- కనపడకుండా పోయిన వారిలో 10 మంది జవాన్లు
- మృతుల సంఖ్య భారీగా పెరుగుతుందన్న ఆందోళనలు
- సిఎంతో మాట్లాడిన ప్రధాని, హోం మంత్రి



ధరాలిలో వరదలకు కొట్టుకుపోతున్న భవనాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. సాయంత్రానికి నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. మరో 50 మంది గల్లంతైనట్లు భావిస్తున్నారు. గల్లంతైనవారిలో పది మంది సైనికులుకూడా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వరదకు ధరాలీ గ్రామం తీవ్రంగా ప్రభావితమైంది. గ్రామంలో ఎక్కడ చూసినా అడుగుల మేర పేరుకుపోయిన బురద కనపడుతోంది. ఈ గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఆర్మీ క్యాంపు (దిగువ హర్షిల్) కూడా కొట్టుకుపోయింది. సమాచారం తెల్సిన వెంటనే సైన్యం వెంటనే రంగంలోకి దిగినా చీకటి పడటంతో సహాయకార్యక్రమాల కొనసాగింపు కష్టంగా మారింది. ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలతో ఖీర్ గంగానదికి మంగళవారం మధ్యాహ్నం మెరుపు వరదలు వచ్చాయి. ఎగువ నుండి ఒక్కసారిగా వచ్చిన బురదతో నిండి ఉన్న ఈ వరద ప్రవాహం సముద్ర మట్టానికి 8,600 అడుగుల ఎత్తున గల ధరాలీ గ్రామం మీద పడింది. ఏం జరుగుతోందో అర్థమయ్యే లోపే గ్రామస్తులు పలువురు వరదలో కొట్టుకుపోయారు. చాలామంది బురదలో చిక్కుకు పోయారు. ధరాలీ గ్రామానికి పర్యాటకంగా ప్రాధన్యత ఉండటం, పలు గెస్ట్‌హౌస్‌లు,హోటళ్ల కూడా ఉండటంతో టూరిస్టులు ఎవరైనా చిక్కుకుపోయారా అన్న దానిపై స్పష్టత రాలేదు. వరద ముంచుకువస్తున్న సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కేకలు పెడుతూ, పరిగెత్తుతున్న పలువురి వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని మిగతా 7లో

కొన్ని గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు

- మళ్లీ ట్రంప్ బెదిరింపులు

వాషింగ్టన్ : ప్రధాని నరేంద్ర మోడీ తనకు అత్యంత ఆప్తుడని పదే పదే చెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విషం గక్కడాన్ని ఆపడం లేదు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ట్రంప్ మంగళవారం సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "ఇండియా మాతో పెద్ద మొత్తంలో వ్యాపారం చేస్తోంది. మేం మాత్రం ఆ స్థాయిలో చేయడం లేదు. అందుకే 25 శాతం సుంకాలు విధించాం. రానున్న 24 గంటల్లో దీన్ని భారీగా పెంచబోతున్నాం. రష్యా నుంచి భారత్ భారీ స్థాయిలో చమురును కొనుగోలు చేస్తుంది. రష్యా యుద్ధ యంత్రానికి ఇంధనం అందిస్తుంది. వారు అలా చేస్తే నేను సంతోషంగా ఉండను." అని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్యం విషయంలో భారత్ మంచి భాగస్వామి కాదని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌పై వాణిజ్యపరంగా అమెరికా ఒత్తిడిని పెంచుతోందని పేర్కొంది. సార్వభౌమ దేశాలకు తమ వాణిజ్య భాగస్వాములను సొంతంగా ఎంచుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.

నగదు బదిలీకి అడుగులు!

- గ్యాస్ కోసం డిజిటల్ వాలెట్
- ఎన్‌టిఆర్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు : మంత్రి నాదెండ్ల



నమూనా స్మార్ట్ రేషన్ కార్డును చూపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

రేషన్‌కు బదులుగా నగదు బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే రేషన్‌బియ్యం స్థానంలో నగదు బదిలీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో డిజిటల్ వాలెట్ విధానాన్ని అమలు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నగదు బదిలీకి డిజిట్ వాలెట్ విధానం తొలిమెట్టు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ కలెక్టరేట్‌లోని విసి హాలులో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువచ్చినట్లు చెప్పారు. సంస్కరణల్లో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ వాలెట్ విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. గ్యాస్ సిలిండర్ ధరకు తగ్గట్టుగా రూ.851 విలువైన ప్రత్యేక కూపన్‌లు ఇస్తామని, దాని ద్వారా వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసుకుంటారని చెప్పారు. ఈ విధానం విజయవంతమైతే రాష్ట్రమంతా అమలు చేస్తామని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు ఎన్నో విషయాలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో రేషన్ దుకాణం మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న గ్రామాల్లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు ఇప్పటికే 69 సబ్ డిపోలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇలాంటి క్లిష్టమైన సమస్యలు భవిష్యత్తులో కూడా ఉత్పన్నమైతే ఇటువంటి చోట్ల నగదు చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు యోచిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మిగతా 7లో

తప్పుడు సాక్ష్యాలతో అక్రమ కేసులు

వైసిపి అధినేత వైఎస్ జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం తప్పుడు సాక్ష్యాలతో అక్రమ కేసులు పెట్టి గిట్టని వారిని జైల్లో పెట్టే పని చేస్తోందని వైసిపి అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన లీగల్‌సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 నెలలుగా రాష్ట్రంలో అన్యాయమైన పాలన సాగుతోందని, న్యాయం, ధర్మం అనేది ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. నచ్చనివారిపై దౌర్జన్యం చేస్తున్నారని, ఎవరైనా స్వరం గట్టిగా వినిపిస్తే తట్టుకోలేకపోతున్నారని వివరించారు. ఎలాగైనా తీసుకుపోయి వారిని జైల్లో పెట్టాలని, పరువు తీయాలని కుట్ర చేస్తున్నారని ఆగ్రహించారు. తప్పు చేయకపోయినా బురద వేస్తున్నారని అన్నారు. తప్పుడు కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి పార్టీ లాయర్లు తోడుగా నిలబడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వారి సేవలు అభినందనీయమన్నారు. పార్టీకి పెద్దన్నలా పనిచేస్తున్న న్యాయవాదులు కష్టకాలంలో పార్టీకి ఎంతో అండగా ఉన్నారని, వారి అంకితభావాన్ని, సేవలను గుర్తు పెట్టుకుంటామని అన్నారు. జగన్ 2.0లో వారందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. పిటిషన్లు వేసి న్యాయస్థానంలో నిలబడకపోతే న్యాయం కూడా దక్కదని పేర్కొన్నారు. కలియుగం అంటే ఏమిటనేది చంద్రబాబు 14 నెలల పాలన చూస్తే తెలుస్తుందన్నారు. ఎక్కడా న్యాయం, ధర్మం లేదని పేర్కొన్నారు. దెబ్బతిన్న వారికి ఎంత బాధ ఉంటుందో దెబ్బ తగిలించిన వ్యక్తికి కూడా తెలియాలని, అందుకే లాయర్ల ద్వారా యాప్ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం విచారించింది. వివేకా హత్య కేసు దర్యాప్తు పూర్తయిందని సిబిఐ తెలిపింది. ఒకవేళ సుప్రీం కోర్టు ఆదేశిస్తే తదుపరి కొనసాగిస్తామని పేర్కొంది. గత విచారణలో సుప్రీం ఆదేశాల మేరకు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ వివరాలను సిబిఐ ధర్మాసనానికి తెలిపింది. కేసు విచారణను ధర్మాసనం ఈనెల 19కి వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీతారెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా విచారణకు హాజరయ్యారు.

ఇడి ఎదుట హాజరైన అనిల్ అంబానీ

- రూ.17 వేల కోట్ల రుణం మోసం కేసులో విచారణ

3

కరేడులో అక్రమ అరెస్టులు

- ఉలవపాడు స్టేషన్‌కు తరలింపు
- ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలి : సిపిఎం, ఎపి రైతు సంఘం



అరెస్టు చేసినట్టు నోటీసులు ఇస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు జిల్లా), అమరావతి

కరేడులో ముగ్గురు ఉద్యమకారులను ఉలవపాడు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ అరెస్టులను సిపిఎం, ఎపి రైతు సంఘం ఖండించాయి. టిడిపి కూటమి ప్రభుత్వం కరేడులో ఇండోసోల్ కంపెనీ కోసం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా రాజకీయాలకతీతంగా రైతులు, ప్రజలు 45 రోజులుగా పోరాడుతున్నారు. అయినా, ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా సర్వే నిర్వహిస్తోంది. కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురంలో గిరిజన కాలనీని తొలగించేందుకు ప్రయత్నించింది. ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సర్వే చేయిస్తోంది. విషయం తెలుసుకున్న రైతు సంఘం నాయకులు జివిబి కుమార్, మూలి వెంగయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య ఆ గ్రామానికి వెళ్లారు. స్థానికులతో కలిసి సర్వే నిలుపుదల చేయాలని కోరుతున్న క్రమంలో ఉలవపాడు సిఐ, ఎస్ఐ, 20 మంది పోలీసులతో అక్కడకు చేరుకున్నారు. ఈ ప్రాంతంలో 30 పోలీసు యాక్టు అమలులో ఉందంటూ వారిని అరెస్ట్ చేసి ఉలవపాడు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కరేడులో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తూ దమనకాండకు దిగుతోందని, బలవంతంగా అక్రమ అరెస్టులు చేయిస్తోందని అన్నారు. దీనికి భయపడేదిలేదని తెలిపారు. కరేడు గ్రామంలోని రామకృష్ణాపురంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే పేరుతో ప్రజల నుంచి బలవంతంగా డాక్యుమెంట్లు తీసుకుంటున్నారని తెలిపారు. సర్వే ఆపాలని, అధికారులకు డాక్యుమెంట్లు ఇవ్వొద్దని చెప్పిన తమను బలవంతంగా అరెస్ట్ చేశారన్నారు. నాయకుల అక్రమ అరెస్ట్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి మిగతా 7లో

రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు తొలిదశ నిర్మాణ గడువు పెంపుపై చర్చ

- ఫోర్ట్ డ్రాఫ్ 16 నుంచి 18.5 మీటర్లకు పెంపు
- కేబినెట్ సబ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పునరుద్ధరణ, డ్రెడ్జింగ్, అంతర్గత బాహ్య రోడ్లు, రైలు అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు సంబంధించిన ప్రతిపాదనలు, పోర్టు ఫేజ్-1 పనులు పూర్తి చేసేందుకు గడువు పెంచే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ భేటీలో చర్చ జరిగింది. సచివాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, బిసి జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేష్ సభ్యులుగా ఉన్న సబ్ కమిటీ భేటీ మంగళవారం జరిగింది. పోర్టు డ్రాఫ్ట్‌ను 16 నుంచి 18.5 మీటర్లకు పెంపు ప్రతిపాదనల్ని పరిశీలించి సిఫార్సులు చేసేందుకు సమాచారాన్ని అధికారులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు గంగవరం, కృష్ణపట్నం పోర్టులతోపాటు రామాయపట్నం పోర్టుకు సంబంధించి ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన రామాయపట్నం పోర్టును కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నట్లు మంత్రులు తెలిపారు. పోర్టు అంశంపై మరో సమావేశంలో కూలంకుషంగా చర్చిద్దామని పేర్కొన్నారు.

కేసు ఫైల్స్ ఇవ్వండి

- వైసిపి నేత కిషోర్ అరెస్టుపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నాయకులు తురకా కిషోర్‌పై రెంటచింతల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఫైల్స్, కేసు డైరీలను సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. మెజిస్ట్రేట్ జారీ చేసిన రిమాండ్ ఉత్తర్వులు అస్పష్టంగా ఉన్నాయని అభిప్రాయపడింది. కిషోర్‌ను అరెస్టు చేసినప్పుడు పోలీసులు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 47, 48 అమలు చేయలేదని నిందితుడు చెబుతున్నారని చెప్పింది. పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరించినట్లుగా లేదని వ్యాఖ్యానించింది. రిమాండ్ ఉత్తర్వులు అస్పష్టంగా ఉన్నందున కేసు డైరీ, ఇతర రికార్డులను సమర్పించాలని జస్టిస్ ఆర్ రఘునందనరావు, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. గుంటూరు జైలు నుంచి తన భర్త కిషోర్ రిలీజ్ అవ్వగానే రెంటచింతల పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారంటూ ఆయన భార్య తురకా సురేఖ హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై తదుపరి విచారణ బుధవారానికి వాయిదా పడింది. తొలుత పిటిషనర్ అడ్వకేట్ రామలక్ష్మణరెడ్డి వాదిస్తూ, కేసు మీద కేసు పెట్టి పోలీసులు కిషోర్‌ను అరెస్టు చేస్తూనే ఉన్నారని చెప్పారు. కిషోర్ అరెస్టు విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు అమలు చేశారని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు.





విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు, కాకినాడ విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్లపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనల వెల్లువ

- ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు
- సంతకాల సేకరణ, అధికారులకు వినతిపత్రాలు అందజేత
- వామపక్షాల సంఘీభావం

ప్రజాశక్తి - యంత్రాంగం

స్మార్ట్ మీటర్లపై ప్రజాగ్రహం పెల్లుబిక్కింది. విద్యుత్తు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలని, ట్రూ అప్‌ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట మంగళవారం ఆందోళనలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, వారితో సంతకాల సేకరణ చేపట్టి అధికారులకు అందజేశారు. ఉరితాళ్లుగా తయారయిన స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయవద్దని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఆందోళనలకు వామపక్షాల నేతల సంఘీభావం తెలిపారు.

విశాఖలో ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ... విద్యుత్తు సంస్కరణల పేరుతో విద్యుత్తు కంపెనీలను అదాని లాంటి బహుళజాతి సంస్థలకు కేంద్రం కట్టబెడుతోందని, అందుకు టిడిపి కూటమి పెద్దలు సహకరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల సంపదను లూఠీ చేయడమే కాకుండా ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరైంది కాదన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎపిఇపిడిసిఎల్ డిఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని అరకులోయ, రంపచోడవరం, కూనవరం సహా పలు మండలాల్లో ధర్నాలు చేశారు.

విజయవాడ సింగ్‌నగర్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు మాట్లాడారు. బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లు, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఇందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల భారం వేయగా, టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.30 వేల కోట్ల భారం వేసిందని తెలిపారు. రాణిగారితోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాద్, ఐఎఫ్‌టియు నాయకులు పాల్గొన్నారు. కాశీనాథ్ మాట్లాడుతూ... స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి పిలుపునిచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం లాగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ప్రజలను మోసగించడమేనన్నారు. ఇబ్రహీంపట్నంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పాల్గొన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

గుంటూరు కొత్తపేటలోని విద్యుత్ శాఖ డిఇఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఎందుకు బిగిస్తున్నారని అధికారులను నాయకులు నిలదీశారు. ప్రస్తుతానికి తాము ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం లేదని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని డిఇ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏలూరు జిల్లాలో 13 కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. కుక్కునూరులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.నాగమణి పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. శ్రీకాకుళంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, విజయనగరం కలెక్టరేట్ సమీపాన విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం విద్యుత్తుశాఖ కార్యాలయాల వద్ద ఆందోళనలు తెలిపారు. ఉమ్మడి అనంతపురం, కడప, నెల్లూరు, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కర్నూలు విద్యుత్ సౌధ ముందు ధర్నా నిర్వహించారు. నంద్యాల విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా చేశారు.

డోలీలో నిండు గర్భిణి తరలింపు



గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా ఏజెన్సీ వాసులకు నేటికీ డోలీ మోతలే శరణ్యమవుతున్నాయి. పాలకుల మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. పురిటి నొప్పులు వచ్చిన నిండు గర్భిణిని ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం ఎత్తయిన కొండ కోనల మీదుగా సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వరకూ డోలీలో మోసుకెళ్లి అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఆస్పత్రికి చేర్చారు. ఈ సంఘటన అనంతగిరి మండలంలో చోటుచేసుకుంది. కొత్తూరు పంచాయతీ పరిధిలోని టెంకబుడ్డి గ్రామానికి చెందిన గన్నెల పద్మకు పురిటి నొప్పులు వచ్చాయి. ఉదయం 4.30 గంటల సమయంలో ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆ గ్రామం నుంచి కొత్తూరు మెయిన్ రోడ్డు వరకూ సరైన రోడ్డు లేదు. ఎత్తైన కొండ, దట్టమైన అటవీ ప్రాంతం నుంచి రోడ్డు మార్గం వరకూ పద్మను తీసుకురావడానికి వారు అష్టకష్టాలు పడ్డారు. కర్రకు రగ్గు కట్టి డోలీలా మార్చి ఇద్దరు కుటుంబ సభ్యులు ఆమెను జాగ్రత్తగా కొండ దిగించారు. అక్కడ నుంచి విజయనగరం జిల్లా ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి ప్రయివేటు వాహనంలో తరలించారు.

ఇప్పటికైనా తమ గ్రామానికి సరైన రోడ్డు మార్గం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజనులు కోరుతున్నారు

పిఆర్ కమిషనరు కార్యాలయం ముట్టడి

- వివిధ జిల్లాల నుంచి హాజరైన సర్పంచులు
- కమిషనరు వైఖరిపై అసంతృప్తి
- మద్దతు తెలిపిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, సర్పంచులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు కార్యాలయ ముట్టడి కార్యక్రమం సర్పంచుల సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సర్పంచులు హాజరై కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల విషయంలో అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం నేత టి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో విడత రూ.1,121 కోట్లు గతేడాది డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ పంచాయతీలకు జమ చేయలేదన్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ సెస్, సీనరేజ్‌లు విడుదల చేయాలని కోరారు. ఆగస్టు 15వ తేదీలోగా ఈ నిధులను పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. 73, 74 రాజ్యాంగ సవరణకు అనుగుణంగా పంచాయతీలకు 29 అంశాలు బదలాయించాలని, ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులు సర్పంచుల ఆధ్వర్యాన జరిగేలా చూడాలన్నారు. సర్పంచుల సంఘం నేత జయరాంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలకు గత నాలుగేళ్లుగా రావాల్సిన బకాయిలను విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సర్పంచుల గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తొలుత కొంత సర్పంచుల సంఘం నేతలు కొద్ది మంది వెళ్లి కమిషనరు కృష్ణతేజను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెలాఖరులోగా నిధులు విడుదల చేసేందుకు కమిషనరు హామీ ఇచ్చినట్లు కృష్ణమోహన్ తెలిపారు. ముట్టడిలో సర్పంచుల సంఘం నేతలు ధర్మరాజు, రమేష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అల్లాబక్షు, శ్రీరామ్మూర్తి, శ్రీకాంత్, మోహన్, రామకృష్ణ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచుల పోరాటానికి మద్దతు తెలియజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

సర్పంచులను 3 గంటలు వేచి ఉంచిన కమిషనరు

పంచాయతీరాజ్ కమిషనరు కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఉదయం 10:30 నుంచి ఆందోళన నిర్వహించగా, కొంత మంది నేతలను 11:20కు లోపలికి వెళ్లి కమిషనరు కృష్ణతేజను కలిసేందుకు పోలీసులు అనుమతించారు. కమిషనరు వద్దకు 20 మంది వెళ్లగా కేవలం నలుగురిని మాత్రమే తన ఛాంబర్‌లోకి అనుమతించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు త్వరలోనే విడుదల చేస్తామని ఆయన చెప్పారు. అదే విషయాన్ని సర్పంచులు అందరి ముందు చెప్పాలని నేతలు కోరగా, కొద్దిసేపు వేచి ఉండాలని సూచించారు. చాలా సమయం వేచి చూసిన సర్పంచులు కమిషనరు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరికి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కమిషనరు కార్యాలయం నుంచి బయటకు వెళుతూ సర్పంచుల వద్దకు వచ్చి నిధులు త్వరలో విడుదల చేస్తామని చెప్పి వెళ్లిపోయారు.

స్థానిక సంస్థలకు 40 శాతం నిధులివ్వాలి : సిపిఎం

స్థానిక సంస్థలకు ప్రభుత్వ ఆదాయంలో 40 శాతం నిధులు కేటాయించాలని 73, 74 రాజ్యాంగ సవరణలో పేర్కొన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచుల నిరసన శిబిరాన్ని సందర్శించిన ఆయన వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు కార్యాలయానికి వచ్చిన సర్పంచులను గంటలకొద్దీ వేచి ఉంచడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల పరిస్థితికి ఈ ఘటనే అద్దం పడుతుందన్నారు. బెంగాల్‌లో ప్రతి ఐదేళ్లకు పంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించి, నిధులు కేటాయించడాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణ చేసినట్లు తెలిపారు. పంచాయతీలకు ఊపిరిపోస్తానని చెప్పిన ఆ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ వాటికి నిధులు కేటాయించడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో తప్పొప్పులను చట్టం, ఆయా పంచాయతీల ప్రజలే తేలుస్తారని చెప్పారు. సర్పంచులపై అధికారుల పెత్తనం పెట్టి వారు చెప్పినట్లే చేయాలని శాసించడం సరైంది కాదన్నారు. పై నుంచి పెత్తనం చేస్తూ, పంచాయతీలకు అధికారం లేకుండా చేయడం రాజ్యాంగ వ్యతిరేకమైన చర్యగా పేర్కొన్నారు. రాష్ట్రంలో పంచాయతీల పరిస్థితి చాల ఘోరంగా ఉందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనరుగా కేరళలో పనిచేసిన ఐఎఎస్ అధికారి కృష్ణతేజను ఏరికోరి తీసుకొచ్చారని, ఆయన సర్పంచులను ఎందుకు పట్టించుకోవడం లేదనేది తెలియని పరిస్థితి అని పేర్కొన్నారు.

రాజధాని చట్టబద్ధతకు కృషి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ జారీకి తాము కట్టుబడి ఉన్నామని, ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివి.ఎన్ మాధవ్ తెలిపారు. గుంటూరులో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉండడం వల్ల అప్పట్లో కేంద్రం ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అస్తవ్యస్తమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల రైతులకు భయం ఏర్పడిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అన్ని అంశాలపై కూలంకషంగా అధ్యయనం చేసి అమరావతికి చట్టబద్ధత కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మొదటి విడత భూసమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు వెంటనే రిటర్నబుల్ ప్లాట్లు అప్పగించాలని, ఈ ప్రక్రియ పూర్తి చేయకుండా మరో విడత సమీకరణ పేరుతో 44 వేల ఎకరాలు తీసుకోవడం సరికాదని తెలిపారు.

సముద్రంలో ముగ్గురు విద్యార్థులు గల్లంతు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)



జశ్వంత్ రాజేష్ దుర్యోధన

శ్రీకాకుళం జిల్లా సంత బొమ్మాళి మండలంలోని భావన పాడు సముద్రతీరంలో స్నానానికి దిగి ముగ్గురు విద్యార్థులు మంగళవారం గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వజ్రపుకొత్తూరు మండలం మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన, పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల జశ్వంత్, పలాస మండలం టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్, విజయనగరం జిల్లా తగరపువలసలోని బాలాజీ పాలిటెక్నికల్ కాలేజీలో డిప్లమో మూడో సంవత్సరం చదువుతున్నారు. ముగ్గురు స్నేహితులు సరదాగా గడిపేందుకు భావనపాడు సముద్రతీరానికి వెళ్లారు. సముద్రంలో స్నానానికి దిగారు. ఇంతలో అలల ధాటికి ఒకరు కొట్టుకుపోతుండగా, అతన్ని కాపాడేందుకు వెళ్లిన మరో ఇద్దరూ గల్లంతయ్యారు. గమనించిన స్థానిక మత్స్యకారులు, మరికొంతమంది యువకులతో కలిసి సముద్రంలో దిగి గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, సంతబొమ్మాళి తహశీల్దార్, మెరైన్ సిఐ డి రాము, మెరైన్ ఎస్ఐలు శ్రీనివాసరావు, బి మన్మథరావు, టెక్కలి రూరల్ సిఐ ఎ శ్రీనివాసరావు, నౌపడ ఎస్ఐ నారాయణస్వామి, సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డ్రోన్ కెమెరాలు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా యువకుల ఆచూకీ లభించలేదు.

నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

- డైరెక్టర్ శివప్రసాద్‌కు ఉద్యోగుల ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డేట్ ఆఫ్ జాయినింగ్ తేదీని ఇంక్రిమెంట్ తేదీగా పరిగణిస్తూ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐక్యవేదిక జెఎసి ఛైర్మన్ ఎమ్‌డి జానిపాషా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 అక్టోబరులో రిక్రూట్‌మెంట్ అయిన ఉద్యోగులకు ఇప్పటికే ఐదు సంవత్సరాల పది నెలల సర్వీస్ పూర్తయ్యిందని, మరో రెండు నెలల్లో ఒకే కేడర్‌లో ఆరు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుంటున్న ఉద్యోగులకు ఆటోమెటిక్ అడ్వాన్స్ స్కీమ్ కింద స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ ఆస్తుల జాబితాకు కార్యాచరణ

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీల సంక్షేమశాఖకు అనుబంధంగా ఉన్న వివిధ ఆస్తుల జాబితాను సిద్ధం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను మైనార్టీ, న్యాయ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు. సచివాలయంలో మైనార్టీశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనార్టీ తరగతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని మైనార్టీ అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. హజ్‌యాత్ర-2026 కోసం యాత్రికుల నుంచి దరఖాస్తుల గడువులోపు రాష్ట్రానికి కేటాయించిన కోటా 2,556 కంటే తక్కువ కాకుండా దరఖాస్తులు అందేలా చూడాల న్నారు. ఇప్పటి వరకూ 2,222 మాత్రమే అందినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, వక్ఫ్ సర్వే కమిషనర్ శిరీన్ బేగం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకూబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మొహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల)

తల్లిదండ్రులు తెచ్చిన పెళ్లి సంబంధం ఇష్టం లేక మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండమంజులూరు గ్రామానికి చెందిన బొప్పూడి శివయ్య దంపతులకు కుమార్తె బొప్పూడి మానస (26) ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మానసకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు సంబంధాలు వెతుకుతున్నారు. అందులో భాగంగా ఒక సంబంధాన్ని ఖాయం చేశారు. ఈ విషయాన్ని తమ కుమార్తెకు తల్లిదండ్రులు చెప్పారు. అయితే ఆ సంబంధం ఇష్టం లేకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకుని మానస ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని భరిస్తాం

- మగ్గాలకు ఉచిత విద్యుత్
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చేనేత వస్త్రాలపై విధిస్తున్న జిఎస్‌టిని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించనుందని పేర్కొన్నారు. సచివాలయంలో చేనేత శాఖపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనివల్ల చేనేత రంగం పుంజుకుంటుందని, తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. చేనేత రంగంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. వ్యవసాయం తరువాత చేనేతే అత్యంత కీలకమైన రంగంగా ఉందని పేర్కొన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందించాలని తెలిపారు. ఈ మేరకు చేపట్టాల్సిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. చేనేత కార్మికుల కోసం రూ.5 కోట్లతో థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం నుంచి వీటిని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

విజయవాడ, విశాఖ, తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ కార్మిక భవనాలు

- ప్రతి ఫ్యాక్టరీలో సేఫ్టీ అధికారి
- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి పట్టణంలో అడ్డా కూలీలు రోడ్లపై గంటల తరబడి నిరీక్షించే పరిస్థితి రాకుండా వారి కోసం పక్కా భవనాలు నిర్మించాలనే ప్రతిపాదనను బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. విజయవాడలోని కార్మికశాఖ ప్రధాన కార్యాలయంలో కార్మిక సంక్షేమ బోర్డు సమావేశం మంగళవారం జరిగింది.

విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఇంటిగ్రేటెడ్ కార్మిక భవనాలను నిర్మిస్తామని, ఓ క్రమ పద్ధతిలో ప్రతి నియోజకవర్గంలో ఓ భవనం నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా కార్మికులు, వారి కుటుంబ సభ్యుల నైపుణ్యం పెంచేలా వారికి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఫ్యాక్టరీలో ఒక సేఫ్టీ అధికారిని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం యూనివర్శిటీలతో ఎంఒయు చేసుకున్నామన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల స్థాపనకు పెద్దయెత్తున ముందుకొస్తున్నారన్నారు. ఏడాదికి 50 రోజుల కంటే ఎక్కువ రోజులు పనిచేసేవారికి కార్మికులుగా గుర్తిస్తున్నామని, ఉపాధి కార్మికులను గుర్తించడంతో రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది కార్మికుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెస్ వసూళ్లపై దృష్టి సారించినట్లు మంత్రి వాసంశెట్టి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులను కూడా పరిగణనలోకి తీసుకురానున్నామన్నారు.

రాష్ట్ర భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ.. రెండేళ్లుగా నిలిచిపోయిన కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరిస్తున్నామన్నారు. కార్మికులు సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందుకునేలా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో సెస్ కలెక్షన్లు పెరగడానికి కృషి చేస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఈ సమావేశంలో కార్మికశాఖ కమిషనరు శేషగిరిబాబు, అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, అధికారులు పాల్గొన్నారు.

పలు కేటగిరి బస్సుల్లో ప్రయాణం లేదు

- ఉచిత బస్సు ప్రయాణంపై ఉద్యోగ సంఘాల భేటీలో స్పష్టత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పలు కేటగిరి బస్సుల్లో ఆ అవకాశం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫ్రీ బస్సు సౌకర్యం గురించి విజయవాడ ఆర్‌టిసి బస్టాండులోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాలతో ఆ శాఖ ఉద్యోగులు చర్చించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రెజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ భేటీలో నాన్ స్టాప్ బస్సులు, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఎసి బస్సులు, తిరుమల ఘాట్ రోడ్డులో వెళ్లే బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఈ నెల ఒకటిన ఇచ్చిన విజ్ఞాపన పత్రంలో ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌ల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. వీటితోపాటు రికవరీలు, టీమ్స్, డ్యామేజీలపై ఇచ్చిన పనిష్‌మెంట్ కాపీలను ఆర్‌టిసి యాజమాన్యానికి అందజేశారు.

అందుబాటులో ఎరువులు

- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఖరీఫ్ సీజన్‌కు అన్ని సహకార సంఘాల్లో, ప్రైవేటు షాపుల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ అంశంపై విజయవాడ నుంచి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహకార సంఘాలను అధికారులు పర్యవేక్షిస్తూ, అందరికీ ఎరువులు అందుతున్నాయా, లేదా అనే విషయాన్ని తనిఖీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో కేంద్రం నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ఎరువులు రప్పించినట్లు చెప్పారు. పలు ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారనే వార్తలు వస్తుండటంతో కారణాలను మంత్రి ఆరా తీశారు. శ్రీకాకుళం, నంద్యాల తదితర జిల్లాల్లో పత్రికా కథనాలపై కలెక్టర్ల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సీజన్‌కు 16.76 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీకి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆగస్టు 5వ తేదీ నాటికి 8.11 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువు అవసరం ఉండగా, 8.80 లక్షల టన్నులు సరఫరా చేశామని తెలిపారు. 1.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకూ 16 వేల మెట్రిక్ టన్నులు జిల్లాలకు సరఫరా చేశామని, మరో 27 వేల మెట్రిక్ టన్నులు సరఫరాకు తగిన చర్యలు చేపట్టామన్నారు. ఎరువల కృత్రిమ కొరత సృష్టించినా, మళ్లింపు చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, సంచాలకులు ఢిల్లీరావు, అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్టేట్, ఇనామ్ గ్రామాల భూ సమస్యలపై త్వరలో నిర్ణయం

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సెటిల్ చేయని 70 ఎస్టేట్, 60 ఇనామ్ గ్రామాలు ఉన్నాయని ఆయా గ్రామాల భూ సమస్యలపై రానున్న సమావేశాల్లో నిర్ణయాలు తీసుకుంటామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సచివాలయంలో రెవెన్యూ సమస్యలపై మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరిగింది. ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, పి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలను మీడియాకు అనగాని వెల్లడించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు ఉద్దేశించిన నాలా చట్టాన్ని రద్దు చేస్తూ రూపొందించిన బిల్లును బుధవారం జరగనున్న కేబినెట్‌లో పెట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం ఆదేశాలతో నాలా రద్దు ముసాయిదా బిల్లులపై సుదీర్ఘ కసరత్తు చేసి పకడ్బందీగా రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల విషయంపై పూర్తి స్థాయిలో చర్చిస్తున్నామని, బలహీనవర్గాలకు నష్టం జరగకుండా అదే విధంగా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా ఇక విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి అక్టోబరు 2లోగా నిర్ణయం తీసుకోవాలని అనుకున్నామని తెలిపారు.

11 మంది డాక్టర్లు, నర్సులపై విచారణ

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాధ్యతా రాహిత్యం, అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగాలపై 11 మంది డాక్టర్లు, నర్సులపై విచారణకు ఆదేశించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2020లో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంటు, వైద్యులు, నర్సుల నిర్వాకాలపై ఎసిబి ఇచ్చిన నివేదికను పరిశీలించిన అనంతరం ఈ మేరకు ఉత్తర్వులిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గుడివాడ ఆస్పత్రిలో అక్రమాలు జరుగుతున్నాయనే సమాచారంతో అవినీతి నిరోధకశాఖ 2020 ఫిబ్రవరిలో రెండు దఫాలుగా తనిఖీలు నిర్వహించి నివేదిక ఇచ్చిందన్నారు. నివేదిక ప్రకారం అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంటు, ఆరుగురు డాక్టర్లు, పరిపాలనాధికారి (ఎఒ), ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మాసిస్టులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

సోలార్ కంపెనీలకు భూముల కేటాయింపును ఆపాలి

- అడిషనల్ సిసిఎల్ఎకు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాల, కడప జిల్లాల్లో సోలార్ పరిశ్రమల కోసం భూములు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు అడిషనల్ సిసిఎల్ఎ ఎన్ ప్రభాకర్‌రెడ్డికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సోలార్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం, రైతులకు సంబంధించిన 2,941 ఎకరాల వ్యవసాయ భూములను సోలార్ కార్పొరేషన్‌కు, గ్రీన్‌కో కంపెనీకి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, పిన్నాపురం గ్రామంలో సోలార్ పరిశ్రమ కోసం గ్రీన్‌కో కంపెనీకి 1,741 ఎకరాలు, కడప జిల్లా, మైలవరం మండలం, దొడియం, వడ్డిరాల గ్రామాల్లోని 1,200 ఎకరాల భూమిని సోలార్ కార్పొరేషన్‌కు కేటాయిస్తూ ఎపి ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎపి భూ నిర్వహణ సంస్థ) 01.08.2025న జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయం 2013 భూసేకరణ చట్టం, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు.

మెట్రోకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలి

- ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ డిమాండ్
- సిఎం, మున్సిపల్ మంత్రి, చీఫ్ సెక్రటరీలకు వినతి పత్రాలు

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడలో మెట్రో రైలు ఏర్పాటుకు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ కోరింది. నగర ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోకుండా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కేవలం బందరు రోడ్డు, ఏలూరు రోడ్లలోనే మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొంది. ఒకవేళ మెట్రో ఏర్పాటు చేస్తే అది నగర విస్తరణ లక్ష్యంగా ఉండాలని సూచించింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో అసోసియేషన్ నగర కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు మాట్లాడుతూ.. మెట్రో రైలు ప్రాజెక్టుపై తమ అభిప్రాయాలను సిఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి, విజయవాడ మున్సిపల్ కమిషనర్లకు మెయిల్ ద్వారా వినతి పత్రాలు పంపామని తెలిపారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ఫ్లైఓవర్లు, ఆర్‌యుబిలు, ఆర్ఒబిలు, రోడ్ల డివిజన్, పాదచారుల ఫుట్‌పాత్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్, చిహ్నాలు ఏర్పాటు చేసి నిబంధనలను సరిగా అమలు చేయాలన్నారు. వాహనాల కోసం ఆధునిక పార్కింగ్ వసతులు కల్పించాలని, వేగపరిమితి బోర్డులు ఏర్పాటు చేసి డ్రైవర్లకు సరైన శిక్షణ ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

విజయవాడలో మెట్రో రైలు ఏర్పాటు చేస్తే అది నగర విస్తరణకు దోహదపడేలా ఉండాలన్నారు. విజయవాడ - ఆగిరిపల్లి - నూజివీడు, విజయవాడ - పెద అవుటపల్లి, విజయవాడ - జి.కొండూరు - మైలవరం, విజయవాడ - నందిగామ, విజయవాడ - కంకిపాడు, విజయవాడ - అమరావతి మార్గాల్లో మెట్రో ఏర్పాటు ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. మెట్రోరైల్‌ను ఆసరా చేసుకొని చిన్న పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉంటుందని, దీనివల్ల ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నగర అధ్యక్షులు వి.సాంబిరెడ్డి, వి.సుందర రామరాజు, ఎ.పున్నారావు, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవితాల్లో చీకట్లు

- అందని ఆధార్, రేషన్ కార్డులు
- సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు కరువు
- విద్య, వైద్యం, తాగునీరుకూ కష్టాలే



ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

'గవర్నమెంట్ నుంచి మాకు ఏమీ రావడం లేదు. బియ్యం కార్డు, ఆధార్ కార్డు లేదు. పింఛన్లు రావు. అడవిలో దొరికే పండ్లను అమ్ముకొని బతుకుతున్నాము. ఐటిడిఎ సార్ వాళ్ళు వస్తుంటారు.. పోతుంటారు. మాకు ప్రభుత్వం నుండి ఏమీ అందవు'. అంటూ ప్రకాశం జిల్లా ఎర్రకురవ చెంచుగూడెంకు చెందిన కుడుముల అంకమ్మ తమ ఆవేదనను వెలిబుచ్చారు.

'మాకు జ్వరం వచ్చినా, దగ్గు వచ్చినా దోర్నాలకు వెళ్లాలి. మా గూడెంలో మందులు ఇవ్వడానికి డాక్టర్లు రారు. ఎప్పుడో ఒకసారి వచ్చి పోతుంటారు'.అని నందిగూడెం చెంచుకాలనీకి చెందిన గువ్వల గురవమ్మ వాపోయారు.

ఇది ఒక్క ప్రకాశం జిల్లాలోని చెంచుగూడెంలకు చెందిన సమస్యలు కావు. శ్రీశైలం ఐటిడిఎ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని గిరిజన గూడెంలలో ఉన్న సమస్యలు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ చెంచుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. విద్య, వైద్యం, తాగునీరు, ఆధార్, రేషన్ కార్డులు నేటికీ పూర్తి స్థాయిలో అందలేదు. నంద్యాల జిల్లా పరిధిలో 48 గూడెలలో 2,975 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇందులో 8,745 మంది జనాభా ఉన్నారు.

వీరిలో 396 మందికి ఆధార్ కార్డులు లేవు. పల్నాడు జిల్లాలో 51 చెంచు గూడేలు ఉన్నాయి. వీటిలో 2,143 చెంచు కుటుంబాలు ఉన్నాయి. 7,235 మంది జనాభా ఉండగా 619 మందికి ఆధార్‌కార్డులు లేవు. ప్రకాశం జిల్లాలో 89 చెంచుగూడెంలో 4,164 కుటుంబాలు నివసిస్తున్నాయి. 14,245 మంది జనాభాకు గానూ 2501 మందికి ఆధార్ కార్డులు లేవు. ఆధార్ కార్డులు లేనందుకు వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాల వారికి అందించే రేషన్ కోసం గూడెం నుంచి సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తమ గూడెంలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేసి సరుకులు పంపిణీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

పింఛన్లు అందవు

వయస్సు పైబడిన వారికి ఎన్‌టిఆర్ భరోసా పింఛను కూడా అందడం లేదు. కొన్ని గూడేలలో పక్కా గృహాలు లేక గుడిసెల్లోనే జీవనం కొనసాగిస్తున్నారు. వర్షాకాలం వీరి పరిస్థితి వర్ణనాతీతం. ఆధార్, రేషన్ కార్డుల కోసం ఏ అధికారికి విన్నవించుకోవాలో కూడా గిరిజనులకు తెలియని పరిస్థితి. ఎప్పుడో అమావాస్యకు, పున్నానికి వచ్చే పోయి అధికారులకు గిరిజనుల సమస్యలు, ఇబ్బందులు వారి స్పృహకు రావడం లేదు.

శిక్షణ సరే..ఉపాధి ఏదీ?

చదువుకున్న యువతీ యువకులకు నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంటలో యువజన శిక్షణ కేంద్రం(వైటిసి) ఏర్పాటు చేసి మూడు జిల్లాలలోని యువతి, యువకులకు చేతి వృత్తులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. కానీ వీరికి ఉపాధి కల్పించడం లేదు. చెంచుగూడెంలో సరైన విద్యను చెప్పేవారు లేక పిల్లలు అడవి బాటపడుతున్నారు. బండి ఆత్మకూర్ పరిధిలోని నెమలికుంట చెంచుగూడేనికి జిల్లా కలెక్టర్ హాజరై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజనులకు కొన్ని పరికరాలు అందజేశారు.

చెంచు సమస్యలపై పోరాటం
వై. ఆశీర్వాదం, కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు



ఐటిడిఎ పరిధిలోని మూడు జిల్లాల్లోని చెంచు గూడెంలలో ఉన్న చెంచు సమస్యలపై పరిష్కారానికి పోరాడుతున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులకు సమస్యలపై పలుమార్లు వినతులు అందజేశాం. కొన్ని సందర్భాల్లో స్వయంగా చెంచుగూడేంలకు వెళ్లి వారిని కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాం. ఇటీవల స్వచ్ఛంద సేవా సంస్థలచే నిత్యావసర వస్తువులు, మందులు, దుస్తువులు పంపిణీ చేయించాము. ప్రభుత్వం చెంచు గిరిజనులను ఆదుకోవాలి.

పిఎం జన్మన్ పథకానికి శ్రీకారం
వెంకట శివప్రసాద్, శ్రీశైలం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి



శ్రీశైలం ఐటిడిఎ పరిధిలో ఉన్న పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లోని చెంచు గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం పిఎం జన్మన్ పథకానికి శ్రీకారం చుట్టింది. చెంచు కుటుంబాలు అభివృద్ధి చెందేలా పక్కా గృహాలు, తాగునీరు, రోడ్లు, ఉపాధి, విద్యుత్తు, విద్య, అంగన్వాడీ కేంద్రాలు, వైద్యం మొదలైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. చెంచుగూడేంలో కొన్ని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కొన్ని పనులకు సర్వేలు చేసి ప్రతిపాదనలు సిద్ధంగా ఉంచాము.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని మంగళవారం తెల్లవారుజామున ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి సుమారు పదివేల మంది అభ్యర్థులు ఈ ర్యాలీలో పాల్గొంటారని, ఈ నెల 20 వరకూ ర్యాలీ కొనసాగుతుందన్నారు. తొలిరోజు ఆర్మీ ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులకు శారీరక పరీక్షలు నిర్వహించారు. ఆర్మీ ర్యాలీకి సంబంధించి ఎలాంటి వార్తలు రాయకుండా మీడియాపై ఆంక్షలు విధించారు. గతంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ఆర్మీ ర్యాలీల్లో లోటుపాట్లపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చిన నేపథ్యంలోనే ఈ సారి మీడియాను దూరంగా ఉంచినట్టు సమాచారం. అభ్యర్థులను మాత్రమే స్టేడియంలోనికి అనుమతిస్తున్నారు.

ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాల్సిందే

- ఆదివాసీ యువగళం జీపు జాతాలో నాయకులు

ప్రజాశక్తి - అరకులోయ, డుంబ్రిగుడ (అల్లూరి జిల్లా)

షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాల్సిందేనని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివాసీలకు షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల్లో వంద శాతం రిజర్వేషన్ కల్పించాలని, మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులను మినహాయించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన 'ఆదివాసీ యువగళం' జీపుజాతా అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో సాగింది. మంగళవారం అరకులోయ టౌన్‌షిప్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. అక్కడ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు అధ్యక్షతన సభ జరిగింది. నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ ప్రకారం ఏజెన్సీలో శత శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే దక్కాలన్నారు. మెగా డిఎస్‌సిలో జరిగిన అన్యాయాన్ని వివరించారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో 400 పోస్టులకుగాను 24 పోస్టులు మాత్రమే స్థానిక అభ్యర్థులకు కేటాయించడం దారుణమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులన్నీ ఆదివాసీలకే కేటాయిస్తాని ఇచ్చిన మాటను సిఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

జీపుజాతా ముగింపు రోజున పాడేరు ఐటిడిఎ వద్ద జరిగే మహాధర్నాకు ఆదివాసీ యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం డుంబ్రిగుడలోనూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీపు జాతా రథసారథులు సాగిన సత్యనారాయణ, భాను, సిహెచ్.రావు, వంతల రాజం నాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గాసి అప్పలస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఐసుబాబు, గిరిజన గురుకుల ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు కొండబాబు, చంద్రు పడాల్, పెద్ద సంఖ్యలో యువతీయువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




అరకులోయలో చేపట్టిన భారీ మానవహారంలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు, యువకులు, విద్యార్థులు

వేగంగా అమరావతి పనులు

- మంత్రి నారాయణ పర్యటన
- 900 మంది రైతులకు కౌలు పెండింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని, మూడేళ్లలో పూర్తి చేసి తీరుతామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి పరిధిలో జరుగుతున్న పనులను ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. పనులు జరగడం లేదని ప్రచారం చేస్తున్న వారు క్షేత్రస్థాయిలోకి వచ్చి చూడాలన్నారు. అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి 2014-19లోనే టెండర్లు పూర్తి చేసి పనులు కూడా ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం మూడు ముక్కలాటతో మొత్తం నాశనం చేసిందన్నారు. రైతులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అధికారులు, ఉద్యోగులకు సంబంధించి నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. వరద ముంపు నివారణకు కాలువల నిర్మాణ డిజైన్లను నెదర్లాండ్స్ ఇచ్చిందన్నారు. రాజధానిలో కొండవీటివాగు 23.6 కిలోమీటర్లు, పాలవాగు 16.5 కిలోమీటర్లు, గ్రావిటీ కెనాల్‌ను 7.84 మీటర్లు మొత్తం 47.94 కిలోమీటర్ల మేర కాలువలను వెడల్పు చేసి తోలుగా తవ్వుతున్నామన్నారు. వీటితోపాటు శాఖమూరు రిజర్వాయర్‌ను 0.03 టిఎంసిల కెపాసిటీతో 50 ఎకరాల్లో, కృష్ణాయపాలెం రిజర్వాయర్‌ను 0.1 టిఎంసిలతో 190 ఎకరాల్లో, నీరుకొండ రిజర్వాయర్‌ను 0.4 టిఎంసిలతో 440 ఎకరాల్లో నిర్మిస్తున్నామని తెలిపారు. 2027 అక్టోబరులోగా ఆయా పనులు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నప్పటికీ వచ్చే ఏడాది చివరకు పూర్తి చేసేలా వేగంగా పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. 30 శాతం పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో సరిహద్దు రాళ్లు తొలగిపోయాయని, తాజాగా ఆయా లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించే ఏజెన్సీలు రాళ్లను పాతుతాయని అన్నారు. 25 వేల మందికి ఈ ఏడాది కౌలు జమచేయాల్సి ఉంటే ఏడువేల మందికి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిల్లోనూ మంగళవారం నాటికి 900 మందికి మాత్రమే పెండింగ్ పెట్టామని పేర్కొన్నారు. కౌలు జమకాని రైతులు వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై సింగపూర్‌కు ఎంతో నమ్మకం ఉందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతో వారు వెనక్కు తగ్గారని, సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు చంద్రబాబు సింగపూర్ వెళ్లారని తెలిపారు. అన్ని విధాలా సహకరిస్తామని వారు తెలిపారని వివరించారు. దీనిపై అధికారులతో చర్చించాలని సిఎం ఆదేశించారన్నారు. సింగపూర్ నేషనల్ పార్కు అథారిటీ సభ్యులు 10 రోజుల్లో అమరావతికి వస్తారని వివరించారు. ఈ పర్యటనలో నారాయణ వెంట చీఫ్ ఇంజినీరు గోపాలకృష్ణారెడ్డి, సిఇ ధనుంజయ పాల్గొన్నారు.




గుజరాత్‌లో ఉపాధి సంక్షోభం

- 7,299 ఎంఎస్ఎంఇల మూత

అహ్మదాబాద్ : గుజరాత్ పారిశ్రామిక విధానం అట్టర్‌ప్లాఫ్ అని మరోమారు రుజువు అయ్యింది. బిజెపి పాలిత ఈ రాష్ట్రంలో ఉపాధి సంక్షోభంలో పడింది. ముఖ్యంగా గుజరాత్‌లో ఉపాధి అవకాశాలు లేక ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఇజిపి) పూర్తిగా విఫలమైంది. సూరత్, నవసారి వంటి ప్రధాన జిల్లాల్లో 2024-25లో ఈ పథకానికి ఒక్క అప్లికేషన్ కూడా రాకపోవడం గమనార్హం. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 7,269 చిన్న, మధ్య తరగతి సంస్థలు (ఎంఎస్ఎంఇ) మూతపడ్డాయి. దీంతో 33,361 మంది ఉద్యోగాలు కోల్పోయారు.

రాజ్యసభలో గుజరాత్ ఎంపి నర్‌హరి అమిన్ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణ ప్రకారం.. ఆర్థిక సంవత్సరం 2020-21లో 19,654 పిఎంఇజిపి అప్లికేషన్లు రాగా.. 2024-25లో 60 శాతం తగ్గి 7,793గా నమోదయ్యాయి. గిరిజన జిల్లాల్లో కూడా పరిస్థితి దయనీయంగా ఉంది. డాంగ్, మహిసాగర్‌లో 7, చోటా ఉదయపూర్‌లో 16, నర్మదాలో కేవలం 2 అప్లికేషన్లు మాత్రమే రావడం గమనార్హం. గుజరాత్ ప్రభుత్వం ఉపాధిపై గొప్ప ప్రకటనలు చేస్తుండగా.. ఈ పథకం వైఫల్యం ప్రభుత్వ వాగ్దానాలకు, క్షేత్ర స్థాయి వాస్తవానికి మధ్య భారీ అంతరాన్ని చూపిస్తోంది. ఈ పథకం పేరుకు మాత్రమే ఉపాధి కల్పన అని గుజరాత్ కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ హిరేన్ బ్యాంకర్ విమర్శించారు. ఉపాధి లేక గుజరాత్ యువతకు వలస పోవాల్సిన పరిస్థితి ఎదురుకానుందన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

350 రోజులుగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షలు

- టిటిడి స్పందించి న్యాయం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాలయం ఎదురుగా శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు నిర్వహిస్తున్న నిరసన దీక్షలు మంగళవారం నాటికి 350వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. 350 రోజులుగా సామాన్యులు తమ సమస్యలు పరిష్కరించమని దీక్షలు చేస్తున్నా టిటిడి యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పలు దఫాలుగా ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి తమ సమస్యలను చెప్పుకుంటున్నా బాధితులకు న్యాయం జరగకపోవడం శోచనీయమన్నారు. దీక్షలు చేస్తున్న పేదల పట్ల కనీసం స్పందించకపోవడం ఏ రకమైన న్యాయమో పాలకులు చెప్పాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు తిరుపతికి పలుమార్లు వచ్చినా, ప్రతి రోజూ అధికార యంత్రాంగం జరుగుతున్న పోరాటం గురించి ప్రభుత్వానికి నివేదనలు చేస్తూనే ఉన్నా, కనీసం స్పందించి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే సామాన్యుల పట్ల వ్యవహరించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని తీవ్రతను చేయడానికి తాము సైతం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర, యూనియన్ అధ్యక్షులు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మధు, వ్యాపారులు ప్రకాష్, రామ్మూర్తి, చిరంజీవి, రాంబాబు పాల్గొన్నారు.



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, కలెక్టర్, ఇతర అధికారులు

బిడ్డలకు తల్లిపాలే అమృతం

- అవగాహన వారోత్సవాలను ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాల ప్రాధాన్యతను తెలియచేసే లక్ష్యంతోనే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టు స్త్రీ, శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బిడ్డకు జన్మనిచ్చిన అరగంట లోపే ముర్రి పాలు తాగించడం ద్వారా నిమోనియో, డయేరియా ఇతర ఇన్‌ఫెక్షన్లు దరిచేరవని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు పౌష్టికారం, విటమిన్ టాబ్లెట్లు, నిరంతరం వైద్యుల సూచనలు, సలహాలు, వైద్య పరీక్షలు అందిస్తున్నామని తెలిపారు. ప్రయాణ సమయాలల్లో పిల్లలకు పాలిచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 1065 గదులను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇడి ఎదుట హాజరైన అనిల్ అంబానీ

- రూ.17 వేల కోట్ల రుణం మోసం కేసులో విచారణ



న్యూఢిల్లీ : రుణ మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎదుట హాజరయ్యారు. రూ.17వేల కోట్ల రుణ మోసాలు, మనీ లాండరింగ్‌కు సంబంధించిన కేసులో ఆయనకు ఇటీవల ఇడి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మంగళవారం ఆయన ఢిల్లీలోని ఇడి ప్రధాన కార్యాలయానికి చేరుకొని అధికారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఇడి నమోదు చేసిందని సమాచారం. జులై 24 నుంచి మూడు రోజుల పాటు రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఇడి సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి నోటీసులు జారీ చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా మళ్లించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి ఈ చర్యలు చేపట్టింది.

ఎగుమతిదారులకు రూ.20వేల కోట్ల ప్రోత్సాహకాలు

- కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ : అమెరికా అధిక టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతిదారులకు భారీ ప్రోత్సాహకాలను ఇవ్వాలని మోడీ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే ఐదేళ్లకు గాను రూ.20,000 కోట్ల ప్రోత్సాహకాలను ఇవ్వడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని సమాచారం. అమెరికా విధించిన 25 శాతం సుంకాలను ఎదుర్కోవడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఇటీవల వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఎగుమతిదారులు కోరారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదారు ఏళ్లకు గాను రూ.20,000 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా వేశామని ఓ అధికారి పేర్కొన్నారు. దీనిపై సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ఆగస్టు నాటికి దీనిని ఖరారు చేసి, సెప్టెంబర్ నుంచి అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

రూ.88 చేరువలో రూపాయి పతనం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతూనే ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం అనిశ్చితికి తోడు, ట్రంప్ మరిన్ని సుంకాలను విధించనున్నట్లు ప్రకటించడంతో మంగళవారం రూపాయి విలువ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. మరోవైపు స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడం తదితర పరిణామాలతో డాలర్‌తో రూపాయి మారకం విలువ 29 పైసలు క్షీణించి 87.95కు దిగజారింది. ఇంతక్రితం ఫిబ్రవరి 10న ఇంట్రాడేలో 87.95 కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ముడి చమురు బ్యారెల్ ధర 0.28 శాతం తగ్గి 68.57 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పతనం

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లను ట్రంప్ టారిఫ్ భయాలు వీడటం లేదు. దలాల్ స్ట్రీట్‌లో వరుస నష్టాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆర్‌బిఐ ద్రవ్య విధాన సమీక్షకు ముందు మదుపర్ల అప్రమత్తంగా వ్యవహారించారు. ఈ పరిణామాల మధ్య మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 308.47 పాయింట్లు కోల్పోయి 80,710కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 73.20 పాయింట్ల నష్టంతో 24,650 వద్ద ముగిసింది. రష్యా చమురు కొనుగోళ్లపై ట్రంప్ టారిఫ్ హెచ్చరికల భయాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. సోమవారం సెషన్‌లో రూ.2,566.51 కోట్ల విలువ చేసే విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ)లు తరలిపోయాయి. ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అధికంగా నష్టపోగా, ఇండస్ఇండ్ బ్యాంక్, మారుతి లాభాల్లో ముగిశాయి.

సంపాదకీయం

అమానుషం

చిన్నారులు తాగే నీటిలో విషం కలిపిన మతోన్మాదుల దుశ్చర్య మానవత్వానికే మాయని మచ్చ. ముస్లిం ప్రధానోపాధ్యాయుడిని లక్ష్యంగా చేసుకుని కర్ణాటకలోని హులికట్టి గ్రామ ప్రాథమిక పాఠశాల తాగునీటి ట్యాంకులో పురుగుల మందు కలిపేందుకు ప్రణాళిక రూపొందించి, అమలు చేసిన శ్రీరామ్ సేన దుర్మార్గం మతోన్మాద దుశ్చర్యలకు సజీవ సాక్ష్యం. ఆ నీటిని ఆ ఉపాధ్యాయుడు తాగకపోవచ్చునని, అవి తాగిన అభంశుభం తెలీని చిన్నారులు బలవుతారన్న కనీస స్పృహ కూడా లేకుండా ఈ దురాగతానికి పాల్పడటంలోనే వారి ఆలోచనలు ఎంత విషపూరితమయ్యాయో స్పష్టమవుతోంది.

విభిన్న మతాలు, కులాలు, సాంప్రదాయాలు, అలవాట్లు, ఆలోచనల సమాహారంగా ఉన్న విశాల భూభాగమే మన దేశం. విభజించు.. పాలించు... సిద్ధాంతం పేరుతో హిందూ, ముస్లిం సంస్థలను ప్రోత్సహించి, దేశ విభజనకు కారకులయ్యారు బ్రిటీష్ వారు. మతాల మధ్య సామరస్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీని బలిగొన్నది ఈ మతోన్మాదమే. ఆ భావజాలం నుంచి పురుడుపోసుకున్న సంస్థలు నిత్యం పెంచిపోషించేది మతాల మధ్య చిచ్చు. వాటి ఆధారంగా అందలాలెక్కడమే! ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్‌దళ్‌లలో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రమోద్ ముతాలిక్ 2005లో స్థాపించినదే శ్రీరామ్ సేన. న్యాయం, ధర్మం ఆధారంగా పరిపాలన ఉండాలనేది శ్రీరాముడి ఆశయమని వాల్మీకి రామాయణం చెబుతుందని, మతాల వారీగా, కులాల వారీగా విభజించేది కాదని మహాత్మా గాంధీ అనేకసార్లు తన యంగ్ ఇండియా పత్రికలో రాశారు. అందుకు భిన్నంగా ఆర్‌ఎస్‌ఎస్ బాటలో పరమత ద్వేషాన్ని ప్రబోధించడం కోసమే శ్రీరామ్ సేన కర్ణాటకలో పనిచేస్తోంది. మోరల్ పోలీసింగ్ పేరుతో వాలంటైన్స్ డే రోజు మాట్లాడుకుంటున్న యువతీ యువకులకు బలవంతంగా పెళ్లిళ్లు చేయడం, తన సభ్యులకు ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇవ్వడం, పలు దాడులు, ముస్లిం యువకుడి హత్య సహా పలు కేసుల్లో ఈ సంస్థ సభ్యులు నిందితులుగా ఉన్నారు. ఈ భావజాలం బుర్రనిండా నింపుకున్న ఆ సంస్థ తాలూకా అధ్యక్షుడు సాగర్ పాటిల్ ప్రభుత్వ పాఠశాలకు ముస్లిం ప్రధానోపాధ్యాయుడుగా ఉండకుండా చేయాలని పథకం రూపొందించాడు. మరో ఇద్దరితో కలిసి అక్కడ చదువుతున్న బాలుడిని ప్రలోభపెట్టి పురుగు మందు కలిపిన బాటిల్ ఇచ్చి, ట్యాంకులో కలిపేలా ఒత్తిడి చేశాడనేది పోలీసుల కథనం. ఆ ఉపాధ్యాయుడి ప్రాణాలకు ప్రమాదం తలపెట్టడం, ఆ పేరుతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించడమో ప్రధానంగా భావించాడు తప్ప... పసిపిల్లల ప్రాణాలను పణంగా పెడుతున్నామన్న స్పృహ కూడా కరువైంది. పరివార్ కుదురులోంచి వచ్చిన సంస్థల్లో, ఆ భావజాలంతో నడుస్తున్న మతోన్మాద సంస్థల్లో సర్వసాధారణంగా వ్యక్తమయ్యే లక్షణమే ఇది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రఖ్యాత చిలుకూరు బాలజీ ఆలయ ప్రధాన అర్చకుడు సిఎస్ రంగరాజన్‌పై జరిగిన దాడి కూడా ఇలాంటిదే. 'రామరాజ్యం' అనే పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని, తనతో చేతులు కలపడానికి నిరాకరించాడని వృద్ధుడని కూడా చూడకుండా అర్చకునిపై దాడికి పాల్పడ్డాడు. 'హిందూత్వ'ను ప్రభుత్వ అధికార సిద్ధాంతంగా చేస్తూ లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చివేయాలన్న ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను చాపకింద నీరులా అమలు చేస్తున్న ఇలాంటి సంస్థల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. దేశమంతటా ఒకేఒక హిందూత్వ అస్తిత్వాన్ని సృష్టించడం కోసం ముస్లింలు, క్రైస్తవులు తదితర మైనారిటీలను పరాయివారుగా పరిగణించి, దాడులు చేస్తూ... అక్కడి బిజెపి ప్రభుత్వాల సాయంతో వారి ఇళ్లను కూల్చివేస్తూ... అమాయకులను శిక్షిస్తున్న ఉదంతాలెన్నో చూస్తున్నాం. సరైన సాక్ష్యాధారాలు సమర్పించకుండా 'మాలేగావ్' పేలుళ్ల వెనకున్న నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేయించుకున్న ఇటీవల ఉదంతమూ ఎరుకే. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు, రాజ్యాంగానికి, ప్రభుత్వానికి ప్రమాదకరంగా ఉన్నాయని సర్దార్ వల్లభాయ్ పటేల్ నాటి సంఘ్ నేత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖలు నేటికీ భద్రంగా ఉన్నాయి. నరేంద్ర మోడీ పాలనలో ఏటా పెరుగుతున్న మత ఘర్షణలు ఈ ప్రమాదానికి హెచ్చరికలే. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతి. మత సామరస్యాన్ని పరిరక్షించుకోవాలి. మతోన్మాదుల చర్యల పట్ల అందరం అప్రమత్తంగా వుండాలి.

సందర్భం

హిరోషిమా డే

మానవజాతి చరిత్రలో ఆగస్టు 6 అత్యంత దుర్దినం. మానవ నాగరికత సృష్టించిన అత్యంత భయంకర ఆయుధం ఈ రోజున ప్రయోగించబడి తన విధ్వంసక రూపాన్ని ప్రదర్శించింది. 1945 ఆగస్టు 6 ఉదయం 8.16 నిమిషాలకు అమెరికా ప్రయోగించిన తొలి అణుబాంబు (లిటిల్ బాయ్) జపాన్ లోని హిరోషిమా నగరంలో పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులతో సహా అప్పటికప్పుడు 90,000 మంది ప్రాణాలు హరించింది. 35,000 మందిని క్షతగాత్రులను చేసింది. మరో మూడు రోజులకు ఆగస్టు 9వ తేదీ ఉదయం 11.02 గంటలకు జపాన్ లోని మరో నగరం నాగసాకి పై అమెరికా వేసిన రెండో బాంబు (ఫ్యాట్ మాన్) సుమారు 70,000 మంది ప్రాణాలు తీసింది. ప్రపంచంలో ఇప్పటివరకు మానవులపై ప్రత్యక్షంగా ప్రయోగించబడిన అణు బాంబులు ఈ రెండే. ఇవి సృష్టించిన విధ్వంసం బాంబులను ప్రయోగించిన క్షణానికే పరిమితం కాలేదు. అణుధార్మికతకు గురైన వారి బిడ్డల్లో, వారి తరువాతి తరాల్లో కూడా దాని ప్రభావం కనిపిస్తూనే ఉంది. అణు బాంబులతో ప్రపంచానికే ప్రమాదం. ★

గాజాలో ఆకలి కేకలు-నిస్సిగ్గుగా సర్కారు



గత 21 నెలలుగా గాజా మీద నెతన్యాహు ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధం ప్రస్తుతానికి అక్కడి ప్రజానీకాన్ని ఆకలికి గురి చేసి జాతి హననానికి పాల్పడాలని చూస్తున్నది. అయినా పాలక బిజెపి ప్రభుత్వంలో చలనం లేదు. ఇజ్రాయిల్ పాల్పడుతున్న దుర్మార్గాన్ని ఖండిస్తూ కనీసంగా ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది మార్చి 9వ తేదీ నుండి గాజా ప్రాంత ప్రజానీకానికి అందాల్సిన ఆహారం, నిత్యవసరాలను నెతన్యాహు ప్రభుత్వం అందనీయకుండా నిలవరిస్తూ వస్తున్నది. ఆకలికి అలమటించి పోతూ గుప్పెడు మెతుకుల కోసం వెతుకులాడుతున్న పాలస్తీనా వాసుల మీద ఇజ్రాయిల్ సైన్యం అత్యంత కిరాతకంగా బాంబులు కురిపిస్తున్నది. అంతర్జాతీయంగా వెల్లువెత్తుతున్న నిరసనల రీత్యా పేరుకి అమెరికా-ఇజ్రాయిల్ కలిసి నాలుగు ఆహార పంపిణీ కేంద్రాలు నెలకొల్పాయేగాని...సాయం కోసం ఎదురు చూస్తున్న అమాయక పౌరులను ఇజ్రాయిల్ సైనికులు కాల్చి చంపుతున్నారు.

అంతర్జాతీయం



ప్రకాశ్ కరత్

సిగ్గు శరం అనేది మిగిలి ఉంటే మోడీ ప్రభుత్వం తల దించుకోవాల్సిన సందర్భం ఇది. గాజాలో ప్రజానీకం మొత్తాన్ని సామూహికంగా ఆకలికి మలమల మాడేలా చేస్తూ, నవజాత శిశువులను, పసిబిడ్డలను కూడా వదలకుండా పౌష్టికాహార లోపానికి, ఆకలికి గురిచేసి మరణపు అంచుల వరకూ నెట్టేస్తున్నది ఇజ్రాయిల్ ప్రభుత్వం.

గత 21 నెలలుగా గాజా మీద నెతన్యాహు ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధం ప్రస్తుతానికి అక్కడి ప్రజానీకాన్ని ఆకలికి గురి చేసి జాతి హననానికి పాల్పడాలని చూస్తున్నది. అయినా పాలక బిజెపి ప్రభుత్వంలో చలనం లేదు. ఇజ్రాయిల్ పాల్పడుతున్న దుర్మార్గాన్ని ఖండిస్తూ కనీసంగా ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది మార్చి 9వ తేదీ నుండి గాజా ప్రాంత ప్రజానీకానికి అందాల్సిన ఆహారం, నిత్యవసరాలను నెతన్యాహు ప్రభుత్వం అందనీయకుండా నిలవరిస్తూ వస్తున్నది. ఆకలికి అలమటించి పోతూ గుప్పెడు మెతుకుల కోసం వెతుకులాడుతున్న పాలస్తీనా వాసుల మీద ఇజ్రాయిల్ సైన్యం అత్యంత కిరాతకంగా బాంబులు కురిపిస్తున్నది. అంతర్జాతీయంగా వెల్లువెత్తుతున్న నిరసనల రీత్యా పేరుకి అమెరికా-ఇజ్రాయిల్ కలిసి నాలుగు ఆహార పంపిణీ కేంద్రాలు నెలకొల్పాయేగాని...సాయం కోసం ఎదురుచూస్తున్న అమాయక పౌరులను ఇజ్రాయిల్ సైనికులు కాల్చి చంపుతున్నారు. అయితే ఆకలికి బలికావడం లేదంటే ఆకలి తీర్చుకునే ప్రయత్నంలో ఇజ్రాయిల్ సైనికుల తుపాకి గుళ్ళకి బలయి మరణించడం-ఈ రెండే పాలస్తీనా ప్రజానీకం ముందున్న మార్గాలుగా నిలిచాయి.

గత కొద్ది వారాలుగా గాజాలో మానవతా సాయాన్ని పర్యవేక్షిస్తున్న అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్యసమితి గాజాలో కరువు నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూనే వస్తున్నాయి. ఆఖరికి ఇజ్రాయిల్ పట్ల సానుకూల పక్షపాత ధోరణి అవలంబించే పశ్చిమ దేశాల మీడియా కూడా గత పదిహేను రోజులుగా గాజాలో నెలకొన్న అమానవీయ పరిస్థితుల గురించి పతాక శీర్షికల ద్వారా హెచ్చరిస్తూ వస్తున్నాయి. బిబిసి, సిఎన్ఎన్, ఐరోపా దేశాల టీవీలు ఎముకల పోగులా తయారైన పసిపిల్లల, క్షుద్బాధతో మరణించిన పసిపిల్లల చిత్రాలను ప్రసారం చేస్తున్నాయి.

గాజాపై అత్యంత దుర్మార్గంగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెనకేసుకు వస్తున్న ఐరోపా మిత్ర దేశాలు కూడా గాజా ప్రజానీకానికి ఆహారం, నిత్యవసరాలు అందనీయకుండా నిలవరిస్తున్న నెతన్యాహు ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తున్నాయి. స్పెయిన్, ఐర్లాండ్, బెల్జియం దేశాలు గాజాపై ఇజ్రాయిల్ ఇంకెంత మాత్రం యుద్ధం కొనసాగించడానికి వీల్లేదని కరాఖండిగా స్పష్టం చేశాయి. ఇజ్రాయిల్ యుద్ధ ప్రయత్నాలకు సహకరించేది లేదని ప్రకటించాయి. ఇజ్రాయిల్‌కు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా, వెన్నుదన్నుగా ఉన్న ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు ఆయా దేశాలలో వెల్లువెత్తుతున్న ప్రజా నిరసనల నేపథ్యంలో జాతి హత్యాకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ నుండి దూరం జరగడానికి కొన్ని పరిమిత చర్యలు ప్రకటించాయి. ప్రత్యేకించి గాజా ప్రాంత ప్రజానీకానికి ఆహార పదార్థాల సరఫరాను నిరోధించడాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

జులై 25న ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్ దేశాధిపతులు అత్యవసర ఆన్‌లైన్ సమావేశం నిర్వహించుకుని తక్షణమే గాజాలో ఆహారం, నిత్యవసరాల సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పౌరులకు అందాల్సిన అత్యవసర మానవతా సాయాన్ని నిలవరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా ఉన్న ఫ్రాన్స్ సెప్టెంబర్‌లో జరగనున్న సమావేశంలో పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ప్రకటించింది. బ్రిటన్ లోని కీర్ స్టార్మర్ ప్రభుత్వం కూడా తక్షణం ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు రెండు రాజ్యాల సిద్ధాంతానికి అంగీకరించకపోతే సెప్టెంబరు సమావేశంలో పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని హెచ్చరించింది. దాదాపు 250 మంది ప్రజాప్రతినిధులు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని కీర్ స్టార్మర్ ప్రభుత్వాన్ని డిమాండు చేసి, ఒత్తిడి తీసుకువచ్చారు. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్ తదితర ఐరోపా దేశాలు విమానాల ద్వారా ఆహార పదార్థాలను గాజాలో జార విడిచేందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వం అనుమతించింది. అయితే ఐక్యరాజ్యసమితి సేవా సంస్థ (యు.ఎన్.ఆర్.డబ్ల్యు.ఎ) మాత్రం ఇది కేవలం కంటి తుడుపు చర్య అని ప్రకటించింది. విమానాల ద్వారా ఆహార పదార్థాలను జారవిడవడం ఖరీదైన వ్యవహారమే కాదు, అసమర్థ వ్యవహారం కూడా. భూమార్గం ద్వారా సరఫరాలతో మాత్రమే గాజా ప్రాంత ప్రజానీకానికి సరైన సాయం అందుతుంది. అందుకుగాను ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ప్రకటించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేసింది.

ఇజ్రాయిల్ మీద ఈగ వాలినా సహించలేని విధంగా వ్యవహరించే పశ్చిమ దేశాలే తమ వైఖరిని సడలించుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడ్డాయి. కానీ మన దేశం అనుసరిస్తున్న వైఖరి మాత్రం పచ్చి దుర్మార్గంగా ఉన్నది. గత పక్షం రోజుల నుండి గాజాలో మానవీయ సంక్షోభం అత్యంత ఆందోళనకర స్థాయికి చేరుకున్నా మోడీ ప్రభుత్వం కిమ్మనకుండా ఉండిపోయింది. మానవతా సాయం అందనీయకుండా అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ మన విదేశాంగ మంత్రిత్వ శాఖ నుండి చిన్నపాటి ప్రకటన కూడా వెలువడలేదు.

ప్రధాని మోడీ తన ఆప్త మిత్రుడు నెతన్యాహుని గాజాకు మానవతా సాయం అందేలా చూడమని మాట వరుసకు కూడా అడగలేకపోయారు. ఐక్యరాజ్యసమితి వేదికల మీద మాత్రం పడికట్టు ప్రకటనలు ఇచ్చారు. గాజాకు మానవతా సాయం అందేలా చూడాలని ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి ఒక ప్రకటన వెలువరించారు. జులై 29న పాలస్తీనా సమస్యకు శాశ్వత శాంతి పరిష్కారం కోసం జరిగిన అత్యున్నత స్థాయి అంతర్జాతీయ సమావేశంలో భారత రాయబారి హరీష్ పి ప్రసంగిస్తూ గాజాలోని పాలస్తీనా వాసులకు ఆహారం, ఇంధనం తదితర కనీస అవసరాలు ఎలాంటి ఆటంకమూ లేకుండా అందేలా చూడాలని కోరారు. అయితే ప్రభుత్వ పరంగా ఇజ్రాయిల్‌తో ఈ విషయం లేవనెత్తడానికి మోడీ సర్కారు తటపటాయిస్తున్నది. ఇంకా దారుణమైన విషయం ఏమంటే తక్షణమే గాజాలో బేషరతుగా కాల్పుల విరమణ పాటించాలని కోరుతూ జూన్ 13న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానంపై మన దేశం ఓటింగ్‌లో పాల్గొనకుండా దూరంగా ఉండిపోయింది.

గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడులపై మోడీ ప్రభుత్వం నైతికంగా దివాళాకోరుతనంతో వ్యవహరించడమే కాదు, కనీస మానవీయ స్పందన కూడా చూపలేదు. 2023 అక్టోబరు ఏడో తేదీ నుండి గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న భీకర దాడులను ఏనాడూ ఖండించిన దాఖలా లేదు. కేవలం పౌర నష్టం నివారించమని ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమైంది. ఈ కాలమంతా మన దేశం తరఫున మోడీ ప్రభుతం ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, బాంబులు సరఫరా చేస్తూనే వచ్చింది. మరోపక్కన గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ముస్లిం ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి తదితర హిందూత్వ శక్తులు పెద్దపెట్టున ప్రచారం చేస్తూ వచ్చాయి. ఉగ్రవాదం పని పట్టాలంటే ఇజ్రాయిల్ మార్గాన్నే అనుసరించాలని రెచ్చగొట్టుడు ప్రచారానికి పాల్పడ్డాయి. వాస్తవానికి జియోనిజం, హిందూత్వ-ఈ రెండూ సైద్ధాంతిక ఆత్మ బంధువులు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇజ్రాయిల్ అనుకూల వైఖరి వివిధ సందర్భాల్లో, వివిధ స్థాయిల్లో బట్టబయలు అవుతూనే ఉంది.

గాజా ప్రాంత ప్రజానీకం అనుభవిస్తున్న దారుణమైన కష్టాలను పశ్చిమ దేశాల మీడియా కూడా ప్రజల ముందు ఉంచుతున్నది. కానీ మన దేశంలో కార్పొరేట్ కంపెనీల కబంధ హస్తాల్లో చిక్కుకుని ఇంగ్లీష్, హిందీ ఛానళ్లు మాత్రం పూర్తిగా 'బ్లాక్' చేశాయి.

చివరికి అత్యున్నత న్యాయస్థానాలు కూడా ఇదేవిధమైన పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. పాలస్తీనా ప్రజానీకానికి సంఘీభావంగా నిర్వహించదలచిన శాంతియుత ప్రదర్శనకు పోలీసు శాఖ అనుమతి నిరాకరించింది. పోలీసు శాఖ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టుకు వెళితే సదరు కోర్టు వారు కూడా పోలీసు శాఖ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు. గాజా ప్రజానీకానికి మానవతా సాయం అందించే విషయమై ముంబై హైకోర్టులో సి.పి.ఐ(యం) వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి స్పందించిన తీరు కూడా ఈ కోవకు చెందినదే. 'దేశంలోని పౌర సమస్యలు వదిలేసి అంతర్జాతీయ విషయాలపై కోర్టులను ఆశ్రయించడం తప్పు' అని కువ్యాఖ్యలకు పాల్పడ్డారు. 'విదేశాంగ విధానాన్ని కేంద్ర ప్రభుత్వానికి వదిలి వెయ్యాలని, ఇందులో ఇజ్రాయిల్, పాలస్తీనాలలో ఏదో ఒక పక్షం వహించమని కోరడం సబబు కాదు' అని కూడా మర్యాదరామన్న తీర్పు చెప్పారు.

హిందూత్వ శక్తులు చేస్తున్న ఇజ్రాయిల్ అనుకూల, ముస్లిం వ్యతిరేక ప్రచారం న్యాయస్థానాలు సహా దేశంలోని వివిధ తరగతుల ప్రజానీకాన్ని ప్రభావితం చెయ్యడం దురదృష్టకర పరిణామం. సామ్రాజ్యవాద వ్యతిరేక, వలస వ్యతిరేక సంప్రదాయాలకు మన ప్రభుత్వం మంగళం పాడుతున్నది. హిందూత్వ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ ప్రభుత్వం దారుణమైన నయవంచనకు పాల్పడుతున్నది. పాలస్తీనా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, గాజా ప్రజానీకాన్ని...ఈ తిరోగామి శక్తుల దుర్మార్గానికి బలి కాకుండా చూడడమే మన ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) పూర్వ ప్రధాన కార్యదర్శి /

వ్యాఖ్య

మతతత్వాన్ని ఎదుర్కోవడంలో సాంస్కృతిక ఉద్యమాల ప్రాముఖ్యత



పి. మధు

మతతత్వం అనేది సమాజాన్ని మతపరమైన లేదా జాతిపరమైన విబేధాల ద్వారా విడదీసే ఒక సిద్ధాంతం. అది తరచుగా అసహనం, సంఘర్షణలను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా భారతదేశం లాంటి దేశాల్లో సామాజిక సామరస్యానికి ఇది తీవ్రమైన ముప్పుగా పరిణమించింది. దీనిని ఎదుర్కోవాలంటే సాహిత్యం, విద్య, సాంస్కృతిక ఉద్యమాల ప్రాముఖ్యత చాలా ఉంది. మతతత్వంతో సంబంధంలేని ఉమ్మడి ఆచారాలు, సాంప్రదాయాలు, సామాజిక విలువలతో కూడిన సమైక్య ప్రయత్నాలు అందుకు చాలా అవసరం. గతంలో సాంస్కృతిక ఉద్యమాలు మతోన్మాదానికి శక్తివంతమైన విరుగుడుగా పనిచేశాయి. మతతత్వాన్ని తిరస్కరించడంలో చరిత్రలో దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రవీంద్రనాథ్ టాగూర్ రచించిన 'గీతాంజలి' రచన ప్రజా సమూహాల్లో ఐక్యత, పరస్పర అవగాహన, మానవతా విలువల్ని గొప్పగా చాటి చెప్పింది. ఆనాటి (1910-12) పరిస్థితుల్లో హిందు, ముస్లిం ఉమ్మడి సాంప్రదాయాలతో యావత్తు దేశం ఐక్యం అవ్వాల్సిన ప్రాధాన్యతను చాటింది. 'గీతాంజలి' రచనలో రవీంద్రనాథ్ టాగూర్ వలస పాలనకు వ్యతిరేకంగా ఐక్యతా శంఖారావాన్ని పూరించారు.

మతతత్వం దాని ప్రభావంపై సరైన అవగాహన

భారతదేశంలో మతతత్వం, మతపరమైన వైవిధ్యం చారిత్రక, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల్లో అవకాశవాదంతో పుట్టింది. విభజించు - పాలించు అన్న బ్రిటిషు విధానాలే దీనికి పునాది. స్వాతంత్ర్యానంతర కాలంలో మతోన్మాద రాజకీయ శక్తులు, స్థానిక ప్రభుత్వ వైఫల్యాల్ని వినియోగించుకొని బలపడడానికి పూనుకొన్నాయి. మతపరమైన లేదా జాతిపరమైన ప్రయోజనాలు, ప్రజల సామూహిక ప్రయోజనాల కంటే ప్రాధాన్యత కల్గిన సిద్ధాంతంగా వీరు ముందుకు తెచ్చారు. ఇది తరచుగా హింస, సామాజిక విభజన వంటి వాటివల్ల ప్రజల్లో మత ప్రాతిపదికన విభజనను పెంచింది. 1947లో మతపరమైన రాజకీయాలు "రెండు జాతులు" సిద్ధాంతాన్ని ప్రేరేపించింది. నాటి దేశ విభజన హింసాయుతంగా మారి ఇల్లు వాకిలి వదిలి వలసలకు దారితీసింది. ఇది మన సామాజిక నిర్మాణంలో, బలమైన గాయాలను మిగిల్చింది. నేడు విభజన రాజకీయాలు మరోసారి ముందుకు వచ్చాయి. ఇది మన ప్రజా సమూహాలను మత ప్రాతిపదికన విభజించి జాతీయ ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తుంది.

దేశంలో సాంస్కృతిక ఉద్యమాల పాత్ర

మతోన్మాద శక్తులు పెరుగుతున్న నేపథ్యంలో, సాహిత్యం, కళలు, విద్య, జీవన శైలి వంటి వాటి ద్వారా సామాజిక స్పృహను, సామరస్యాన్ని పెంపొందించడానికి సాంస్కృతిక ఉద్యమం ప్రారంభమైంది. విభజన కథనాలను సవాలు చేస్తూ మతతత్వానికి ఒక ప్రతిఘటనా శక్తి రాజకీయ, ఆర్థిక విధానాల ద్వారానే కాకుండా సామూహిక ఐక్యత మీద, మతసామరస్యం మీద నిమగ్నమైన కృషి సాంస్కృతిక రంగంలో ముందుకు వచ్చింది. ప్రధానంగా సామాజిక విలువలు, సహకారం, వైవిధ్యంలో అస్థిత్వం వంటి వాటిని స్వాగతిస్తూ వైజ్ఞానిక కార్యక్రమాలు విస్తారంగా ప్రారంభమయ్యాయి. ఇవి వైవిధ్యాన్ని గుర్తించి, సామరస్యాన్ని ప్రోత్సహించి ప్రజల సానుభూతిని పొందాయి. మతతత్వం యొక్క మూలాలైన అజ్ఞానం, అశాస్త్రీయ భావనలను సాంస్కృతిక ఉద్యమాలు విమర్శనాత్మకంగా ఎదుర్కొన్నాయి. సైన్సు, చరిత్ర, సాహిత్యం, కళలు అందుకు పునాదిగా నిలిచాయి.

కళలు - సాహిత్యం - మానవతా దృష్టి

సాంస్కృతిక ఉద్యమాలు మతపరమైన, జాతిపరమైన హద్దులను దాటి ప్రజలను సామూహిక జీవనంలో భాగస్వాములను చేశాయి. కళలు, సాహిత్యం ద్వారా మానవతా విలువల్ని బలంగా ప్రజల ముందు ఉంచగలిగాయి. ఉదాహరణకు రవీంద్రనాథ్ టాగూర్ 'గీతాంజలి' రచన భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. జనగణమన జాతీయ గీతమే పెద్ద ఉదాహరణ. భక్తి, ఉపనిషత్తులు, సాంప్రదాయాలతో సనాతన ధర్మం, పాతుకుపోయిన భావజాలం నేపథ్యంలో 'గీతాంజలి' పద్యాలు ప్రజల ఉమ్మడి ప్రయోజనాల్ని ముందుకు తెచ్చాయి. ఆధ్యాత్మిక ధోరణి, వ్యక్తిగత ధోరణి అంశాల్ని అధిగమించి ప్రజల్ని ఐక్యం చేయడానికి గీతాంజలి రచన గొప్పగా తోడ్పడింది. 'గీతాంజలి' "పద్యం - 35" భయాన్ని అధిగమించే, (ఉత్తేజపరిచే) భావజాలాన్ని పూరించింది, వలస వ్యతిరేక ఐక్యతను ప్రేరేపించింది. మతపరమైన విభజనలను మించి విశాల దృష్టితో పరిణామాల్ని పరిశీలించడానికి పాఠకులను ప్రోత్సహించింది. అదే విధంగా 1930 - 1940ల్లో 'ప్రేమ్‌చంద్', 'ఫైజ్ అహ్మద్ ఫైజ్' వంటి ప్రముఖుల నేతృత్వంలోని 'ప్రోగ్రెసివ్ రైటర్స్ మూవ్‌మెంట్' సాహిత్యం - రచనలు లౌకికతత్వం, సమానత లాంటి అంశాలను ముందుకు తెచ్చాయి.

వివిధ సమూహాల మధ్య సఖ్యత - అవగాహన

కళలు, సాహిత్యంతో విభిన్నమైన సంప్రదాయాలతో సర్దుబాటు కావడానికి సాంస్కృతిక రంగం వేదికగా తోడ్పడింది. సమాజంలో బలంగా వేళ్లూనుకున్న మూఢవిశ్వాసాలు, వివిధ సమూహాల మధ్య సఖ్యతకు ఆటంకంగా ఉన్న ధోరణులపై కళలు, సాహిత్యం ధ్వజమెత్తాయి. అటు హిందూ ఇటు ముస్లిం ఆధ్యాత్మిక సాంప్రదాయాలను మేళవించి సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి, సూఫీ ఉద్యమాలు ముందుకొచ్చాయి. 'కబీర్', 'రూమీ' వంటి కవులు తమ రచనల ద్వారా మతతత్వంపై నిరసన తెలిపి ప్రజల మధ్య ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించారు. ఆధునిక కాలంలో 'జాతీయ మతసామరస్య ఫౌండేషన్' కార్యక్రమాలు పాఠశాలల్లో లౌకిక భావనలతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాయి. పిల్లలకు జాతి, మతపరమైన వైవిధ్యం వివరించి ఉమ్మడి జీవన ప్రాధాన్యతను బోధించాయి. వివిధ మత సమూహాల మధ్య సఖ్యత కోసం సంగీత కచ్చేరీలు, రంగస్థల నాటికలు రూపంలో సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. విభిన్న సాంప్రదాయాలతో కూడుకున్న (నాటకాలు, పాటలు, చారిత్రక కథలు) తమ భావాలు పంచుకునే వేదికలుగా వెలిశాయి.

విభజన కథనాలు - సాంస్కృతిక రంగం

ప్రస్తుతం మతతత్వం వక్రీకరించిన చారిత్రక కథనాల ద్వారా, ప్రింట్ / ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం ప్రజల్లోకి వస్తోంది. మతపరమైన విభజన గీతలు గీయడానికి సోషల్ మీడియా దుర్వినియోగం అవుతుంది. ఈ నేపథ్యంలో బాధ్యతాయుతమైన మీడియా ప్రవేశించి ఈ విభజన పోకడలను ఎదుర్కొంటున్నాయి. శాస్త్రీయ విద్య ప్రచారానికి వేదికలయ్యాయి. 19వ శతాబ్దపు భారత పునరుజ్జీవనం, హేతువాదం, సమానత్వం, మత సామరస్యాన్ని ముందుకు తెచ్చిన అంశాలే నేడు పునాదిగా నిలిచాయి. మొఘలాయుల పాలనను, బలవంతపు మత మార్పిడుల పాలనగా

మతోన్మాదాన్ని ఎదుర్కొనడంలో సాంస్కృతిక రంగానికి సామర్థ్యం ఉన్నప్పటికీ నేడు సాంస్కృతిక రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మతపరమైన శక్తులు తరచుగా సాంస్కృతిక వారసత్వంలోకి చొరబడి వక్రీకరణలకు పూనుకుంటున్నాయి. కొన్ని చారిత్రక అంశాలను ఈ శక్తులు కో-ఆప్ట చేసుకోవడం ద్వారా మతోన్మాదానికి పూనుకుంటున్నాయి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విభజన రాజకీయాల కోసం మతపరమైన చిత్రాలను, కళలను, కథనాలను ప్రోత్సహించినట్లే ఇప్పుడు కొన్ని శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

చిత్రించినా, వివేకానందుడిని హిందూవాదిగా పేర్కొన్నా, చారిత్రక కథనాలు అందుకు అంగీకరించడం లేదు. ఎన్నో కథనాలు ఎదురొడ్డి నిలుస్తున్నాయి. మొఘలుల సామ్రాజ్యంలో సాగిన మతాంతర వివాహాల ప్రోత్సాహం మత సామరస్యాన్ని చాటింది. అంతేకాదు వారి పాలనలో హిందువులను ఉన్నత పదవులలో నియమించి సామరస్యాన్ని చాటారు. మొఘలాయుల పాలన కంటే ముందు హిందువుల మీద ఉన్న పన్నులను తొలగించి సఖ్యతను చాటారు. సామాజిక సఖ్యత కోసం మొఘలుల పాలనలో సల్పిన కృషి మతసామరస్యానికి భూమికగా నిలిచింది. ఒకవేళ నేడు మత దృష్టితో స్కూళ్లల్లో పాఠ్యాంశాలు మార్చినా మొఘలాయుల కాలం నాటి చరిత్రను తుడిపేయడం సాధ్యం కాదు. విద్య, సాహిత్యం, శాస్త్రీయ పరిశోధనలు ఈ ప్రయత్నాలకు అడ్డుగా నిలుస్తున్నాయి. మొఘలాయులు బలవంతంగా మత మార్పిడిని ప్రోత్సహించినారని నేడు కేంద్ర పాలకులు ప్రచారం సాగిస్తుంటే, సాహిత్య చరిత్ర దాన్ని అవకాశవాద ప్రచారంగా రుజువు చేస్తోంది. బెంగాల్‌లో భారీగా పెరిగిన ముస్లిం జనాభాను చూపి మత మార్పిడులు జరిగాయని మతోన్మాదులు ఆరోపించారు. బ్రాహ్మణాధిపత్య సామాజిక అణచివేతను ఎదుర్కోవడానికి, అలాగే బెంగాల్ ప్రావెన్స్‌లో హిందూ సంస్థానాధిపతుల అధిక పన్నులు, దౌర్జన్యాలు భరించలేక చాల మంది దేశీయంగా ఇస్లాంను స్వీకరించారని స్వామి వివేకానందుడు 'సెలెక్టెడ్ రైటింగ్స్'లో పేర్కొన్నాడు. మత మర్పిడులు బలవంతంగా చేశారన్నది వాస్తవం కాదని ఆయన అన్నారు. రవీంద్రనాథ్ టాగూర్ గీతాంజలి అయినా, వివేకానందుని సెలక్టెడ్ రైటింగ్స్ అయినా ఎన్నో సంవత్సరాల కిందట పేర్కొన్న అంశాలే. అయితే నేడు సాంస్కృతికోద్యమం ఈ చరిత్ర ఆధారంగానే నేటి మతోన్మాదుల్ని ఎదుర్కొంటోంది. ఇదే సాంస్కృతికోద్యమం ప్రత్యేకత, ప్రాముఖ్యత.

అణగారిన వర్గాలను శక్తివంతం చేయడం

ఆర్థికంగానూ, సామాజికంగానూ అణగతొక్కబడటం, ముఖ్యంగా మైనార్టీల విషయంలో మతపరమైన ఉద్రిక్తతలను పెంచుతుంది. మసీదుల ధ్వంసం, గోరక్షక దళాల అకృత్యాలు, 370వ అధికరణం రద్దు, ఏకరూప పౌర స్మృతి పోకడ, పౌరసత్వ చట్ట సవరణ, లాంటి ఎన్నో ఉదాహరణలు మతోన్మాదుల పోకడలను బట్టబయలు చేస్తున్నాయి. మతతత్వాన్ని ఎదుర్కోడానికి సాంస్కృతికోద్యమంలో కళలు, సాహిత్యం సాధనాలుగా ఉన్నాయి. వీటిని సాంస్కృతిక వారసత్వం ముందుకు తెస్తుంది. సామాజిక న్యాయాన్ని దళిత సాహిత్యం, మాలపల్లి నవల లాంటి రచనలు బలంగా నిలబెడుతున్నాయి. దళిత సాహిత్యం, సాంస్కృతిక ఉద్యమాలు, కుల ఆధారిత మతతత్వాన్ని సవాలు చేయడానికి ముందుకొచ్చాయి. అణగారిన వర్గాల గౌరవాన్ని నొక్కి నిలబెట్టే సాహిత్యమే కాదు, సామాజిక న్యాయంలో నిలబెట్టే కథనాలు, మహిళలు, ముస్లిం మైనారిటీల సామాజిక న్యాయాన్ని ముందుకు తెస్తున్నాయి. జైన సమాజ సంక్షేమ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక శ్రేయస్సుకు దోహద పడ్డాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అణగారిన వర్గాలను శక్తివంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

చారిత్రక సమకాలీన ఉదాహరణలు

జాతీయోద్యమంలో భాగంగా మతతత్వాన్ని ఎదుర్కోవడంలో సాంస్కృతిక ఉద్యమాలు గతంలో కీలక పాత్ర పోషించాయి. 'టాగూర్' పాటలు, సంస్కరణోద్యమాల మత సామరస్యం దళిత, గిరిజన సాహిత్యం విభిన్న సమాజాలను ఐక్యం చేసింది. స్వాతంత్ర్యానంతరం అమర్ అక్బర్ ఆంథోనీ వంటి వాటి ద్వారా మత సామరస్యం ప్రోత్సహించబడింది. వీధి నాటికలు సినిమా పాటలు, కవులు, కళాకారుల రచనలు జాతీయ సమైక్యతకు, మత సామరస్యానికి ఎనలేని కృషి చేశాయి. ప్రపంచంలో సైతం నేడు సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక న్యాయం మీద దృష్టి సారించాయి. "బ్లాక్ లైవ్స్ మ్యాటర్" (వికేంద్రీకరణతో సామాజిక, రాజకీయ ఆందోళన 2013లో రేసిజానికి వ్యతిరేకంగా) క్రాస్ కల్చరల్ సంఘీభావాన్ని ప్రోత్సహించాయి. సాంస్కృతిక క్రియాశీలత విబేధాలను సైతం ఎలా తగ్గించగలదో రుజువు చేశాయి. బ్రిటన్‌లోని 'డిస్మాలాండ్' సర్కస్ టెంట్లు లాగా కళారూపకం సాంస్కృతిక రంగంలో ప్రధాన స్రవంతి విబేధాలను విస్మరించేలా చేసింది. సాంస్కృతిక క్రియాశీలత మత సామరస్యాన్ని, సామాజిక న్యాయాన్ని చాటుతున్నాయి.

సవాళ్ళు-భవిష్యత్ మార్గం

మతోన్మాదాన్ని ఎదుర్కొనడంలో సాంస్కృతిక రంగానికి సామర్థ్యం ఉన్నప్పటికీ నేడు సాంస్కృతిక రంగం అనేక సవాళ్ళను ఎదుర్కుంటోంది. మతపరమైన శక్తులు తరచుగా సాంస్కృతిక వారసత్వంలోకి చొరబడి వక్రీకరణలకు పూనుకుంటున్నాయి. కొన్ని చారిత్రక అంశాలను ఈ శక్తులు కో-ఆప్ట చేసుకోవడం ద్వారా మతోన్మాదానికి పూనుకుంటున్నాయి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విభజన రాజకీయాల కోసం మతపరమైన చిత్రాలను, కళలను, కథనాలను ప్రోత్సహించినట్లే ఇప్పుడు కొన్ని శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వక్రీకరణలు ఎంతవరకు పోయాయంటే, రవీంద్రనాథ్ టాగూర్ గీతాంజలిలో మత సామరస్యాన్ని నిలపడానికి, ఐక్యతను సాధించడానికి పేర్కొన్న అన్ని అంశాలనూ పక్కకు నెట్టి ఆధ్యాత్మిక అంశాన్నే బలంగా ముందుకు తెస్తున్నాయి. వేమనను, జాషువాను ఇలాగే కో ఆప్ట్ చేసుకొని ప్రచారం చేస్తున్నాయి. శివాజీని, పటేల్‌ను, ఆఖరికి సంస్కరణోద్యమాలను కో-ఆప్ట్ చేసుకొంటున్నాయి. అయితే, శాస్త్ర, సాంకేతిక విజయాలు, చారిత్రక సాంస్కృతిక వారసత్వం, ఈ వక్రీకరణలను మనిషిని నీడ వెంబడించినట్లే వెంబడిస్తున్నాయి. జాతీయోద్యమ రోజుల్లో మతోన్మాదాన్ని ఎదుర్కొన్నట్లే నేడు మతోన్మాదాన్ని సాంస్కృతికోద్యమం ద్వారా ఎదుర్కోవలసి ఉంది. సాంస్కృతికోద్యమ ప్రాముఖ్యత ఇదే.

/ వ్యాసకర్త సిపిఎం ఎ.పి పూర్వ కార్యదర్శి /

ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు

ఢాకా : బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ నాయకుడు ముహమ్మద్ యూనస్ మంగళవారం వెల్లడించారు. '2026 ఫిబ్రవరిలో రంజాన్‌కు ముందు సాధారణ ఎన్నికలు నిర్వహించాలని తాత్కాలిక ప్రభుత్వం తరపున ఎన్నికల సంఘానికి నేను లేఖ రాస్తాను' అని యూనస్ తెలిపారు.

ఆర్టికల్ 370, 35ఎ రద్దుకు ఆరేళ్లు

- జమ్ముకాశ్మీర్‌లో బ్లాక్ డే.. పదిహేను నిమిషాలు లైట్లు బంద్
- రాష్ట్రహోదా ఇవ్వాల్సిందే : మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లా
- మా హక్కుల్ని కేంద్రం కాలరాసింది : సిపిఎం ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి
- 'హమారీ రియాసత్, హమారా హక్' పేరుతో నిరసనల హోరు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎలను రద్దు చేసి ఆరేళ్లు గడిచాయి. ఈ సందర్భంగా ఆగస్టు 5ను (మంగళవారం) జమ్ముకాశ్మీర్‌లో బిజెపి మినహా మిగిలిన పార్టీలు బ్లాక్ డే పాటించాయి. మంగళవారం రాత్రి 9 గంటల నుండి 15 నిమిషాల పాటు కాశ్మీర్ వ్యాప్తంగా లైట్లను బంద్ చేసి ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ రద్దును ముక్త కంఠంతో వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా మాజీ సిఎం, పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ కేంద్రం చర్యతో కాశ్మీరీల వాణి, హక్కులు మూగబోయాయన్నారు. కేంద్రం చీకటి మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇవ్వాల్సిందే : ఫరూక్ అబ్దుల్లా

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను మళ్లీ ఎప్పుడిస్తారని అధికార నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమకు రాష్ట్రహోదా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. జమ్ముకాశ్మీర్‌లోని రాజకీయాల్లో కేంద్ర ప్రభుత్వం తరపున వైస్రాయ్ కూర్చొని ఉన్నారని, కాశ్మీర్‌లో ప్రభుత్వమున్నా వైస్రాయ్ అన్నీ తానై నడిపిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలనా పద్ధతిలో మార్పు జరగాల్సిన సమయం వచ్చిందని, ఇదొక ప్రజాస్వామిక దేశమని అన్నారు. గత ఆరేళ్లలో జమ్ముకాశ్మీర్ కోసం ఏం చేశారో చెప్పాలని కేంద్ర సర్కారును ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న కుల్గాం ఎన్‌కౌంటర్‌పై ఆయన స్పందిస్తూ, మనం అనుసరిస్తున్న మార్గం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. పొరుగుదేశాలతో ఇదే విధంగా వ్యవహరిస్తే శాంతియుత వాతావరణం ఏర్పడదని ఆయన అభిప్రాయపడ్డారు. యుద్ధం అనేది మార్గం కానే కాదని, చివరకు కలం, చర్చలతోనే మార్గాన్ని వెతకాల్సి ఉంటుందని తెలిపారు. యుద్ధం వల్ల దేశానికి నష్టమే జరుగుతుందని చెప్పారు.

జమ్ముకాశ్మీర్ ప్రజల హక్కుల్ని కేంద్రం కాలరాసింది : సిపిఎం ఎమ్మెల్యే తరిగామి

ఆర్టికల్..370 రద్దు చేసి కేంద్రంలోని బిజెపి సర్కార్ జమ్ముకాశ్మీర్ ప్రజల హక్కుల్ని కాలరాసిందని సిపిఎం ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా బుల్డోజర్ రాజకీయాలకు మోడీ ప్రభుత్వం తెరలేపిందన్నారు. కేంద్రం కుట్రలతో జమ్ము, లద్దాఖ్‌లను విడదీసిందని, ఈ చర్యకు జమ్ము ప్రజలు పూర్తి వ్యతిరేకమని అన్నారు. నాడు.. నేడూ విభజన రాజకీయాలతో లబ్ధి పొందాలనుకుంటే.. జనం తిరగబడతారని తెలిపారు. ఇప్పటికే జమ్ము ముక్కలు చేయాలని బిజెపి పాలకులు ఎత్తులు వేస్తున్నారని, అలాంటి దుష్ట రాజకీయాలకు జనం చరమగీతం పాడతారని స్పష్టం చేశారు. విధ్వంసం, ప్రజా గొంతులను అణగదొక్కే చర్యలతో.. జమ్ము ప్రజలు నిశ్శబ్దంగా ఉన్నారనుకుంటే పొరపాటేనని స్పష్టం చేశారు.

లాక్కున్న హక్కులన్నీ తిరిగి ఇచ్చేదాకా బ్లాక్ డే : నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ

ఆర్టికల్ 370 రద్దును తాము ఎప్పటికీ అంగీకరించలేదని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధికార ప్రతినిధి ఇమ్రాన్ నబీ దార్ పేర్కొన్నారు. జమ్ముకాశ్మీర్ నుండి లాక్కున్న హక్కులన్నీ తిరిగి ఇచ్చే దాకా ఏటా ఆగస్టు 5న బ్లాక్ డే నిర్వహిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుతంగా ధర్నాలు : కాంగ్రెస్

చారిత్రక జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ)గా మార్చడాన్ని అంగీకరించబోమని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 'హమారీ రియాసత్, హమారా హక్' పేరుతో మంగళవారం జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు తెలిపామని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మీడియా కోఆర్డినేటర్ నీరజ్ గుప్తా తెలిపారు.


రాంచీలో శిబుసోరెన్ అంతిమయాత్రకు హాజరైన ప్రజానీకం

'దిషోమ్ గురు' అమర్ రహే

- అధికార లాంఛనాలతో శిబుసోరెన్ అంత్యక్రియలు
- రాహుల్‌గాంధీ, ఖర్గే హాజరు

రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎంఎ) సహ వ్యవస్థాపకులు శిబు సోరెన్ అంత్యక్రియలను మంగళవారం పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. రాయ్‌గఢ్‌లోని సోరెన్ పూర్వీకుల గ్రామం నెమ్రాలో శిబుసోరెన్ అంత్యక్రియలను ఆయన పెద్ద కుమారుడు, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నెమ్రా గ్రామానికి రాష్ట్రం నలుమూల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు చేరుకున్నారు. 'దిషోమ్ గురు'గా అభిమానులు, మద్దతుదారులు పిలుచుకునే శిబుసోరెన్ సోమవారం ఢిల్లీలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. శిబు సోరెన్ భౌతిక కాయాన్ని రాంచీకి తరలించారు. ప్రజలు అంతిమ నివాళులర్పించడం కోసం సోరెన్ భౌతిక కాయాన్ని జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి కొన్ని గంటలపాటు వుంచారు. సోరెన్ భౌతికకాయానికి గవర్నర్ సంతోష్ గంగ్వార్, స్పీకర్ రవీంద్రనాథ్ మహతో, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. తరువాత నెమ్రాకు అంతిమయాత్ర నిర్వహించారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో 13న దేశవ్యాప్త ఉద్యమం

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ నెల 13న దేశవ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. నాడు ఈస్ట్ ఇండియా కంపెనీ దేశాన్ని దోచుకుతింటే, నేడు కార్పొరేట్ ఇండియా దేశ సంపదను దోచుకుతింటుందని విమర్శించారు. మరోవైపు అమెరికా టారిఫ్‌తో బెదిరించి, దేశ వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో అమెరికా టారిఫ్‌లను, కార్పొరేట్ల దోపిడీని అరికట్టాలని, ఓడించాలని అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాజ్యసభ ఎంపి, ఎఐఎడబ్ల్యుయు ఉపాధ్యక్షులు వి శివదాసన్, బికెఎంయు నేత విఎస్ నిర్మల్, ఎఐఎఆర్ఎల్ నేతలు నివాస్, ఆర్ఎస్ డాగర్, ఎఐఎస్‌కెఎస్ నేత డికె వర్మతో కలిసి వెంకట్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అండదండలతో ప్రజలను కార్పొరేట్లు దోచుకుంటున్నారని, దేశ సంపదను కొల్లగొడుతున్నారని అన్నారు. కార్పొరేట్ల కళ్లు రైతుల భూములు, వ్యవసాయ ఉత్పత్తులు, మైనింగ్‌పై పడ్డాయని, అందుకే ఆగ్రో బిజినెస్ పేరుతో వాటిని లాక్కొనేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు.

వరదల్లో మరణించిన వారంతా స్వర్గానికి వెళతారు

- ఉత్తరప్రదేశ్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో : వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు, కట్టుబట్టలతో మిగిలిన వారికి సహాయం చేయాల్సిన మంత్రి అందుకు విరుద్ధంగా మాట్లాడి విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల భారీగా వరదలు సంభవించిన ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ దెహాత్ జిల్లాలో రాష్ట్ర మంత్రి సంజయ్ నిషాద్ పర్యటించారు. "మా ప్రాంతమంతా నీటమునిగింది. ఇళ్లు కూలిపోయాయి. మా కుటుంబ సభ్యులు చనిపోయారు. ఇప్పుడు మేం ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు" అంటూ స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మంత్రి సమాధానం ఇస్తూ "గంగమ్మతల్లి తన బిడ్డల పాదాలు కడగడానికి వస్తుంది. ఆ దర్శనం ద్వారానే ఆ బిడ్డల పాపాలు పోతాయి. వరదల్లో మరణించిన వారంతా స్వర్గానికి వెళతారు. మిమ్మల్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి" అని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై బాధితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వంలో నిషాద్ పార్టీ భాగస్వామ్య పక్షంగా ఉంది. సంజయ్ ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారు.



కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫోటో

హ్యాపినెస్, వాటర్ క్యారీ చిత్రాలకు అవార్డులు

- 'ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025'కు ఎంపికైన వినుకొండ ఫొటోగ్రాఫర్లు

ప్రజాశక్తి - వినుకొండ

'ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డుకి పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్లు ఎంపికయ్యారు. అంతర్జాతీ య ఆదివాసి దినోత్సవం సందర్భంగా క్రియేటివ్ కల్చర్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ అండ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల ఫొటో కాంటెస్ట్ నిర్వహించడం జరిగింది. పశ్చిమ బెంగాల్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొన్నారు. వినుకొండకు చెందిన వంగపల్లి బ్రహ్మయ్య తీసిన "హ్యాపీనెస్", కేసానపల్లి సుబ్బారావు తీసిన "వాటర్ క్యారీ" ఛాయాచిత్రాలు అవార్డుకు ఎంపికయ్యాయి. ఆగష్టు 18న ఉదయం 11 గంటలకు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో అవార్డులను అందుకోనున్నారు. కాంటెస్ట్ చైర్మన్ గ్రాండ్ మాస్టర్ తమ్మా శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ పట్టణంలోని పలువురు ఫొటోగ్రాఫర్లు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మద్యం కుంభకోణంలో రూ.2 వేల నోట్లూ కీలకమే

- మంత్రి అనగాని సత్య ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 13 నెలల్లోనే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో పలు రకాల సంస్కరణలు చేపట్టిందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు కొరిటపాడులోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అర్బన్ మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వెంటనే అందిస్తున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటూరుకు చెందిన ఆలపాటి సుధాకర్ ఆయన భార్య ఆలపాటి నాగ లీలావతికి దాఖలు దస్తావేజు ట్రాన్స్‌ఫర్ చేసిన విధానాన్ని పరిశీలించి, వారికి సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అర్బన్ మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సులభతరమైన విధానాలను అవలంబించి తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుందన్నారు. మద్యం కుంభకోణంలో వైసిపి నాయకులు రూ.2 వేల నోట్లను 2024 వరకు తీసుకున్నారని ఆరోపించారు. వెంకటేష్ నాయుడు మద్యం కుంభకోణంలో రూ.2 వేల నోట్లు మార్పిడి చేసింది నిజమేనని సిట్ తేల్చిందన్నారు. మద్యం కుంభకోణం తరువాత కూడా రూ.2 వేల నోట్లు చలామణిలో ఉన్నాయని తెలిపారు. వైసిపి నాయకులు బంగారం ఎక్కడ కొనుగోలు చేశారనే అంశంపై విచారణ జరుగుతోందన్నారు. సాంకేతిక యుగంలో కూడా రూ.లక్ష కోట్ల వరకు లావాదేవీలు నగదు రూపంలో జరిగాయంటే ఎంత పెద్ద ఎత్తున అవినీతి జరిగిందో చెప్పవచ్చన్నారు. రాజధాని అమరావతిపై వైఎస్ జగన్‌కు ఇష్టం లేకనే మూడు రాజధానుల పేరుతో అందరినీ నష్టపరిచారని తెలిపారు.

సభను ఛైర్మన్ నడిపిస్తున్నారా? అమిత్ షానా?

- సభలోకి సిఐఎస్ఎఫ్ సిబ్బందిని ఎలా అనుమతిస్తారు?
- రాజ్యసభలో ఖర్గేతో సహా ప్రతిపక్షాల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సభను ఛైర్మన్ నడిపిస్తున్నారా? లేక మంత్రి అమిత్ షా నడిపిస్తున్నారా? అని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జునఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో సిఐఎస్ఎఫ్ సిబ్బందిని ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రం తీరును నిరసిస్తూ మంగళవారం రాజ్యసభలో గందరగోళం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తప్పుపట్టారు. మల్లికార్జున ఖర్గే లేఖను మీడియాకు విడుదల చేయడం లేదని హరివంశ్ తెలిపారు. మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ సభలో సాయుధ బలగాలను మోహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ సమయంలో సభాపతి, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సిఐఎస్ఎఫ్ సిబ్బంది వెల్‌లోకి దూసుకురావడంతో దిగ్భ్రాంతి చెందామని సభ్యులు పేర్కొన్నారు. సభ్యులు తమ ప్రజాస్వామ్య బద్ధమైన హక్కుల అంశంలో నిరసన చేపడుతున్నప్పుడు సిఐఎస్ఎఫ్ దళాలు ఎలా వచ్చాయని ఖర్గే ప్రశ్నించారు. రెండురోజులుగా ఇదే జరుగుతోందని, మన పార్లమెంట్ అంత దిగజారిపోయిందా? అని ప్రశ్నించారు. సిఐఎస్ఎఫ్ బలగాలు సభలోకి రావడం అత్యంత అభ్యంతరకరమని, దాన్ని ఖండిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో సభ్యులు ప్రజా సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను లేవనెత్తినప్పుడు సిఐఎస్ఎఫ్ దళాలు.. హౌజ్ వెల్‌లోకి దూసుకువస్తాయా అని ప్రశ్నించారు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ సిఐఎస్ఎఫ్ సిబ్బంది కాదని, పార్లమెంటరీ భద్రతా సిబ్బందని తెలిపారు. సభ మర్యాదను కాపాడుకోవడానికి బాధ్యత వహించే వారు మార్షల్స్ అని పేర్కొన్నారు. హౌజ్ వెల్‌లోకి కేవలం మార్షల్స్‌ను మాత్రమే అనుమతిస్తారని కేంద్ర మంత్రి రిజిజు తెలిపారు. ఖర్గే సభను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. సభా నాయకుడు జెపి నడ్డా మాట్లాడుతూ సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం అప్రజాస్వామికమని అన్నారు. ఖర్గే స్పందిస్తూ ప్రతిపక్ష నేతలుగా రాజ్యసభలో అరుణ్ జైట్లీ, లోక్‌సభలో సుష్మా స్వరాజ్ ఉన్నప్పుడు ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయడానికి కార్యకలాపాలను అంతరాయం కలిగించడం కూడా ఒక విధానమేనని అనే వారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఆందోళన చేస్తున్నామని, అది తమ హక్కు అని పేర్కొన్నారు.

వారు భద్రతా సిబ్బంది కాదు : జాన్ బ్రిట్టాస్

సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులపై చర్యను ఖండిస్తున్నానని చెప్పారు. పార్లమెంట్ భద్రతా సిబ్బంది అందరినీ వెనక్కి పంపారని, వారు మూలల్లో కూర్చున్నారని అన్నారు. ఇప్పుడు సిఐఎస్ఎఫ్ వారిని పార్లమెంట్ భద్రతా సిబ్బందని చెబుతున్నారని, వెల్‌కి వచ్చిన వారిలో ఎవరూ పార్లమెంటు భద్రతలో భాగం కాదని అన్నారు. వారిని సిఐఎస్ఎఫ్ నుండి తొలగించారా? దేశానికి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు బిజెపి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చ కోసం డిమాండ్ చేస్తే సభకు అంతరాయం కలిగిస్తున్నట్లు మాట్లాడటం దారుణమని అన్నారు. 'సిఐఎస్ఎఫ్ అక్కడ ఏమి చేస్తుంది? వారు మార్షల్స్ అని చెబుతున్నారు. కానీ సిఐఎస్ఎఫ్ వారిని మార్షల్స్‌గా పరిగణిస్తారు. వారు మార్షల్స్ లాగా దుస్తులు ధరిస్తారు. కానీ వారు సిఐఎస్ఎఫ్ వారు. పార్లమెంటులో మన ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంది?" అని ప్రశ్నించారు.

శివసేన ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ "మార్షల్స్, సిఐఎస్ఎఫ్ వెల్‌లోకి పరిగెత్తిన తీరు చూస్తే, బీహార్‌లోని ఎస్ఐఆర్‌పై చర్చ కోరినందుకు నేరస్థులంలా కనిపిస్తోంది. పార్లమెంటు సభ్యులు సభలోకి ప్రవేశిస్తున్నప్పుడు వారిపై దాడి చేశారు. ఒక పురుష మార్షల్ రేణుకా చౌదరితో చెడుగా ప్రవర్తించాడు. ఇది సిగ్గుచేటు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

ట్రంప్ సుంకాల బెదిరింపులపై

మోడీ మౌనం దేనికి సంకేతం?

- ఆ వ్యాఖ్యలు సార్వభౌమత్వాన్ని అవమానించడమే
- పార్లమెంట్‌లో నిలదీసిన ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులపై ప్రధాని మోడీ మౌనం దేనికి సంకేతం ఇస్తుందని ప్రతిపక్ష నేతలు నిలదీశారు. మంగళవారం పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతలు మాట్లాడుతూ.. ట్రంప్ పదేపదే చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ మాట్లాడుతూ.. రష్యా చమురు కొనుగోళ్లపై ఇండియాపై సుంకాలను గణనీయంగా పెంచుతానని ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 'ట్రంప్, తన మధ్య ప్రత్యేక బంధం ఉందని చాలా సంవత్సరాలుగా ప్రధాని చెబుతున్నారు. ఈ స్నేహం చాలా ఖరీదైనదని నిరూపించబడింది. అమెరికాతో మన సంబంధాలు క్షీణించాయని స్పష్టంగా తెలుస్తుంది' అని అన్నారు.

సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ.. రష్యా చమురు కొనుగోళ్లపై ఇండియాపై సుంకాలను గణనీయంగా పెంచుతామని ట్రంప్ చేసిన ప్రకటన బాధ్యతారాహిత్యమైనదని అన్నారు. 'కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో డొనాల్డ్ ట్రంప్ వాదనలను తిప్పికొడుతున్నారని అంటున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు పెద్దయెత్తున ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. అమెరికా, పాశ్చాత్య దేశాల నుంచి చమురు తీసుకుంటున్నారని నాకు సమాచారం ఉంది. బయటకు వారు అమెరికా దాడిని ప్రతిఘటిస్తున్నట్లు కనిపిస్తూ... రష్యా నుండి దూరమై, అమెరికా, దాని మిత్రదేశాల నుండి పెద్దయెత్తున చమురు కొనుగోలు చేస్తున్నారు. ఇది దురదృష్టకరం' అని అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోకి నిరంతరం చొరబడి కీలకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇది ప్రజల జీవితాలను, జీవనోపాధిని ప్రభావితం చేస్తుంది. మొదటిది ఆఫ్‌షోర్ మైనింగ్. రెండవది ఆఫ్‌షోర్ అణు ఖనిజాల మైనింగ్. కాబట్టి, కేంద్ర ప్రభుత్వానికి మా అభ్యర్థన ఏమిటంటే, ఈ విషయాలను తుది నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలి. కేంద్ర ప్రభుత్వం ఇవన్నీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తుంది. ఇది మాకు ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు.

శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ.. 'రష్యా నుండి చమురు కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌తో యుద్ధానికి మద్దతు ఇస్తున్నామని ట్రంప్ చేసిన ఆరోపణలు పూర్తిగా తప్పు. అమెరికా, యూరోపియన్ యూనియన్ రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తూ... ఇండియాపై నిందలు వేయడం ఎలా న్యాయమైనది? అమెరికా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై కూడా సుంకాలు విధించాలి' అని అన్నారు. ఆర్ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ.. 'ట్రంప్ అసమంజసమైన వాదనలు చేస్తున్నారు.

మనం అమెరికాకు లేదా మరే ఇతర దేశానికి లోబడి లేమని చెప్పాల్సిన అవసరం ఉంది. మనకు అందరూ సమాన భాగస్వాములు. అటువంటి పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా స్పందించాలి. ట్రంప్ వ్యాఖ్యలన్నీ దేశ సార్వభౌమ స్వభావాన్ని అవమానించడం' అని పేర్కొన్నారు.

సిపిఐ ఎంపి పి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. 'ట్రంప్ అనవసరంగా జోక్యం చేసుకుని పహల్గామ్, కాల్పుల విరమణపై ప్రకటన చేసినప్పుడు ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదు.

ప్రధాన మంత్రికి సోషల్ మీడియాలో అత్యధిక అనుచరులు ఉన్నారు. వారు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఒక్క పోస్ట్ కూడా పెట్టలేదు. ట్రంప్ పరిపాలనలో యుఎస్ ప్రతిరోజూ ఇండియాను అవమానిస్తోంది' అని అన్నారు. శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. 'ట్రంప్ ఇండియాను పదే పదే బెదిరిస్తున్నా, మన ప్రధాని, ప్రభుత్వం దీనిపై ఒక్క మాట కూడా మాట్లాడేందుకు సిద్ధంగా లేరు. ఇండియాపై ఒత్తిడి తీసుకురావడానికి అధ్యక్షుడు ట్రంప్ ఎవరు? ఇంతకుముందు ఏ రష్యన్ లేదా అమెరికన్ అధ్యక్షుడు కూడా ఇండియా గురించి ఇలా మాట్లాడలేదు' అని అన్నారు.

నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జిలు కారు: ప్రియాంక గాంధీ

నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జిలు కారని ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. పార్లమెంట్ ఆవరణలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని, రాహుల్ గాంధీ చేసింది అదేనని ఆమె అన్నారు. ప్రభుత్వానికి సమాధానం ఇవ్వడం ఇష్టంలేకే ఇటువంటి వ్యూహాలన్నింటినీ ఆశ్రయిస్తారని విమర్శించారు. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జిలు కాదని ఆమె అన్నారు. రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు. 'పార్లమెంటును కూడా నడపలేనంత బలహీనంగా మారారా? మొత్తం ప్రతిపక్షాలు డిమాండ్ చేసే ఒకే అంశంపై వారు ఎందుకు చర్చలు జరపలేరు?' అని ప్రశ్నించారు.



ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందే

- ప్రతిపక్షాల ఆందోళన నడుమ గోవా బిల్లు ఆమోదం
- మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టడం, ప్రభుత్వం ససేమిరా అనడంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడ్డాయి. మంగళవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు పట్టుకుని పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. గందరగోళ పరిస్థితుల్లోనే ఎటువంటి చర్చ లేకుండా గోవాలో ఎస్‌టి అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించిన బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఇటు రాజ్యసభలోనే ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలుత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, తిరిగి ప్రారంభమైన సభలోనూ ఆందోళన కొనసాగడంతో బుధవారానికి వాయిదా పడింది. ఎటువంటి చర్చ లేకుండానే ప్రతిపక్షాల ఆందోళన మధ్య మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించే తీర్మానాన్ని ఆమోదించారు.

ప్రతిపక్షాల ఆందోళన మధ్య కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టారు.

పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

పార్లమెంట్ ఆవరణలో బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పార్లమెంట్ మకరద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపిలు నిరసన చేపట్టాయి. ప్లకార్డులు పట్టుకుని మోడీ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, ఇతర ప్రతిపక్ష ఎంపిలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

16 ఏళ్లకు తగ్గించవద్దు!

- అందువల్ల లైంగిక దోపిడీ పెరుగుతుంది
- సుప్రీంలో కేంద్రం అభ్యంతరం

న్యూఢిల్లీ : పరస్పర అంగీకారంతో లైంగిక సంబంధాలు నెరిపేందుకు చట్టబద్ధమైన వయసును 18 నుండి 16 ఏళ్లకు తగ్గించడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇటువంటి మార్పు వల్ల బాలల అక్రమ రవాణా మరింతగా పెచ్చరిల్లుతుందని, లైంగిక దుర్వినియోగ సంఘటనలు ఎక్కువవుతాయని హెచ్చరించింది. బాలల రక్షణ చట్టాలు నీరుగారుతాయని ఆందోళన వెలిబుచ్చింది. ఈ మేరకు కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భటి రాతపూర్వకమైన వాదనలను సుప్రీంకోర్టుకు అందచేశారు. లైంగిక వేధింపులకు గురయ్యే చిన్నారుల్లో మెజారిటీ బాధితులు తమకు బాగా తెలిసిన వారినుండే ఈ రకమైన ప్రవర్తనను ఎదుర్కొంటారని పేర్కొంటూ 2007 నాటి అధ్యయన వివరాలు ఉదహరించింది. మైనర్లకు అంత అవగాహనా స్థాయి వుండదని, అందువల్ల వారు నిజాయితీగా సమ్మతి లేదా ఆమోదం ఇవ్వలేరని వాదించింది. వారికి రక్షణ కల్పించేందుకే 18 ఏళ్ల వయసు పరిమితిని విధించినట్లు పేర్కొంది. బాల్య వివాహాల చట్టం, బాలనేరస్తుల చట్టం వంటి ఇతర చట్టాలకు అనుగుణంగా ఈ పరిమితి వుంటుందని పేర్కొంది. ప్రస్తుత చట్టం ప్రకారం 18ఏళ్ల లోపు బాలికతో లైంగిక చర్యను అత్యాచారం కింద పరిగణిస్తారు. భారతదేశ రాజ్యాంగానికి, అంతర్జాతీయ ఒప్పందాలకు అనుగుణంగా, లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా బలమైన రక్షణ కవచంగా చట్టం పనిచేయాలని కేంద్రం పేర్కొంది.

ఇజ్రాయిల్ దాడులకు మరో 79 మంది బలి

- చిన్నారిసహా మరో 8మంది ఆకలితో మృతి
- యుద్ధాన్ని ముగించాలంటూ ట్రంప్‌నకు టెల్‌అవీవ్ అధికారుల లేఖ

గాజా, జెరూసలేం : గాజాలోని వివిధ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ మారణహోమానికి గత 24 గంటల్లో మరో 79 మంది ప్రాణాలు కోల్పోయారు. 644 మంది గాయపడ్డారు. వైమానిక, పదాతి దాడులను ఇజ్రాయిల్ ముమ్మరం చేసింది. మరోవైపు గాజాలో ఆకలి కేకలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ కృత్రిమంగా సృష్టించిన కరువు కాటకాల వల్ల ఆకలికి తాళలేక గత 24గంటల్లో ఓ చిన్నారిసహా ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రజలకు మానవతా సాయం అందడానికి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ఇజ్రాయిల్ ఆచరణలో అమలు చేస్తున్న చర్యలకు సంబంధించిన డేటాను గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం వెల్లడించింది. సోమవారం గాజాకు కేవలం 95 ట్రక్కుల ఆహారాన్ని అనుమతించారు. గాజాలోని ప్రజల కనీసపు అవసరాలు తీరాలంటే ప్రతి రోజూ కనీసం 600 ట్రక్కుల ఆహారం అవసరం కాగా, అందులో కేవలం 15శాతానికి సమానమైన మొత్తాన్నే ఇజ్రాయిల్ అనుమతిస్తోందని మీడియా కార్యాలయం తెలిపింది.

అంతర్జాతీయ ఛారిటీ సంస్థలకు తల్లుల వేడుకోలు

ఆకలి అని ఏడుస్తున్న పిల్లలకు ఆహారం పెట్టేందుకు లేక తల్లులు మానసికంగా చిత్రవధ అనుభవిస్తున్నారని, తమ పిల్లలకు ఆహారం అందించాలంటూ వారు అంతర్జాతీయ చారిటీ సంస్థలకు విజ్ఞప్తులు చేస్తున్నారని ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ మీడియా, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఘదా అల్హాద్దాద్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ అనుసరిస్తున్న ఈ విధానం పెద్దా, చిన్నా అని తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తోందని ఆమె అన్నారు. పైగా దీనివల్ల అనేక



అంటువ్యాధులు కూడా వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి గాజాలోని వ్యవసాయ భూములను ఇజ్రాయిల్ పనిగట్టుకుని నాశనం చేయడం వల్ల ఆహార కొరత విపత్తు మరింత ముదురుతోందని అన్నారు. ఇప్పటికే వున్న ఇళ్ళు కోల్పోయి, తాత్కాలిక శిబిరాల్లో తల దాచుకున్న ప్రజలు ఎటూ దిక్కుతోచని స్థితిలో వున్నారు. ఇజ్రాయిల్ పదాతి దళాలు వెస్ట్‌బ్యాంక్‌లో నివసిస్తున్న 15 మందికిపైగా ప్రజలను అదుపులోకి తీసుకున్నారని, ఇళ్లు కూల్చివేశారని, స్థానికులపై దాడి చేశారని పాలస్తీనా వర్గాలు తెలిపాయి. గాజాలో క్షేత్ర స్థాయిలో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను బయటి ప్రపంచానికి తెలియచేయడానికి అనుమతించాలంటూ విదేశీ జర్నలిస్టులు చేపట్టిన 'ఫ్రీడమ్ టు రిపోర్ట్' చొరవను హమాస్ సమర్ధించింది. గాజాలో మానవతా సాయంతోపాటు సమాచారాన్ని కూడా నిషేధించారు. దీనివల్ల అక్కడి దయనీయ, దుర్భర పరిస్థితులు బయటి ప్రపంచానికి తెలియడం లేదు. సమాచారం తెలుసుకునే ప్రజల హక్కు, జర్నలిజం హక్కులు కాలరాయబడుతున్నాయని ఫొటోగ్రాఫర్ ఆండ్రీ లియోహన్ తెలిపారు.

యుద్ధాన్ని ముగించాలంటూ ఇజ్రాయిల్ మాజీ అధికారుల లేఖ

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించాలని, బందీలను విడుదల చేయించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను 600 మందికిపైగా ఇజ్రాయిల్ మాజీ భద్రతా అధికారులు లేఖ పంపారు.

గాజాపై క్యాబినెట్‌లో చర్చించనున్న నెతన్యాహూ

కాల్పుల విరమణపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలం కావడంతో గాజాలో చేపట్టాల్సిన తదుపరి చర్యలపై చర్చించేందుకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ ఈ వారంలోనే తన మంత్రిమండలితో సమావేశమవుతారు. గాజాపై పట్టు బిగించేందుకు అదనపు దళాలను మోహరించే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణపై దోహాలో హమాస్, ఇజ్రాయిల్ మధ్య చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేకపోయాయి. గాజాలో యుద్ధాన్ని విస్తరించి, పాలస్తీనాను పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికే నెతన్యాహూ మొగ్గు చూపుతున్నారని ఇజ్రాయిల్‌కు చెందిన ఛానల్ 12 ఓ అధికారిని ఉటంకిస్తూ చెప్పింది.

జమ్ముకాశ్మీర్ రాష్ట్ర ఆఖరి గవర్నర్ సత్యపాల్ మాలిక్ మృతి



న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్ రాష్ట్ర ఆఖరి గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) మంగళవారం తుదిశ్వాస విడిచారు. కొన్ని నెలలుగా డయాబెటిక్స్, కిడ్నీ వ్యాధి, రక్తపోటు, ఊబకాయం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో ఆయన బాధపడుతున్నారు. న్యూఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం 1:12 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. జూన్ 11వ తేదీన మూత్ర నాళాల ఇన్ఫెక్షన్‌తో సత్యపాల్ మాలిక్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపింది. జమ్ముకాశ్మీర్‌తో పాటు బీహార్, ఒడిషా, మేఘాలయ, గోవా రాష్ట్రాలకు సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా పనిచేశారు. సత్యపాల్ మాలిక్ 1946 జూలై 24న ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లా హిసావాడలో జాట్ కుటుంబంలో జన్మించారు. మీరట్ విశ్వవిద్యాలయం నుండి సైన్స్, ఎల్ఎల్‌బిలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1974-77 మధ్య ఎమ్మెల్యేగా ఉన్నారు. 1980-1986, 1986-89 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. సత్యపాల్ మాలిక్ 2017లో బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2018 ఆగస్టులో ఆయనను జమ్మూకాశ్మీర్‌కు పంపారు. 2019లో ఆగస్టు 5న ఆర్టికల్ 370 కింద జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేయబడినప్పుడు ఆయన ఆ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. 2019 అక్టోబర్‌లో ఆయనను గోవాకు బదిలీ చేశారు. ఆ తరువాత తొమ్మిది నెలల్లోనే సత్యపాల్‌ను మేఘాలయకు తరలించారు. అక్టోబర్ 4, 2022న మేఘాలయ గవర్నర్‌గా పదవీ విరమణ చేశారు. పుల్వామా ఉగ్రదాడికి సంబంధించి ముందస్తు సమాచారం ఉన్నా కేంద్రప్రభుత్వం సక్రమంగా స్పందించలేదంటూ ఆయన పలు విమర్శలు చేశారు. అనంతరం ఆయన నివాసాలపై కేంద్ర సంస్థలు దాడులు చేశాయి.

డేరా సచ్చా సౌధ చీఫ్‌కు మరోసారి పెరోల్

చండీగఢ్ : అత్యాచారం కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌధ చీఫ్ గుర్మీత్‌రామ్ రహీమ్ సింగ్‌కు ఈ ఏడాది మరోసారి పెరోల్ మంజూరైంది. మంగళవారం నుంచి 40 రోజుల వరకూ పెరోల్ మంజూరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివరిలో బీహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెరోల్ ఇచ్చారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏప్రిల్‌లో 21 రోజుల పెరోల్ లభించిన తరువాత గుర్మీత్‌కు ఇది మరొక పెరోల్. ఈ ఏడాది జనవరిలో ఆయనకు 30 రోజుల పెరోల్ లభించింది. అప్పట్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పెరోల్ రావడం విశేషం. గత ఏడాది అక్టోబర్ అంటే హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా గుర్మీత్ సింగ్‌కు 20 రోజుల పెరోల్ లభించింది. ఇద్దరు శిష్యులపై అత్యాచారం చేసిన కేసులో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్షను సిబిఐ ప్రత్యేక కోర్టు విధించింది. హర్యానాలోని రోహ్‌తక్‌లో సునారియా జైల్లో ఈ శిక్షను గుర్మీత్ అనుభవిస్తున్నారు.

సివిల్ కేసును క్రిమినల్ కేసుగా ఎలా మారుస్తారు?

- అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : సివిల్ కేసును క్రిమినల్ కేసుగా ఎలా మారుస్తారంటూ సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సివిల్ కేసులో డబ్బును రికవరీ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ పద్ధతిగా క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతించవచ్చని తీర్పు సందర్భంగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులో 12వ పేరాగ్రాఫ్‌లో నమోదు చేసిన నిర్ధారణలను చూసి దిగ్భ్రాంతికి గురయ్యామని బెంచ్ పేర్కొంది. సివిల్ కేసుల పరిష్కారానికి సుదీర్ఘకాలం పడుతుందని, అందువల్ల ఫిర్యాదీదారుడు ఆ కేసును క్రిమినల్ కేసుగా మార్చుకోవడానికి అనుమతించవచ్చంటూ న్యాయమూర్తి ఆ తీర్పులో వ్యాఖ్యానించారు. దానిపై సుప్రీం బెంచ్ స్పందిస్తూ, ఆ తీర్పును చూడగానే ముందుగా నోటీసులు కూడా జారీ చేయకుండా జోక్యం చేసుకోవడానికి కూడా తాము వెనుకాడలేదని పేర్కొంది. ఈ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పదవీ విరమణ చేసేవరకు క్రిమినల్ కేసులు విచారించకుండా చూసుకోవాలని హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సుప్రీం ఆదేశించింది.

కరేడులో అక్రమ అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

మూలం రమేష్ తీవ్రంగా ఖండించారు.

అక్రమ అరెస్టులు ఆపాలి : సిపిఎం

కరేడులో పోలీసు నిర్బంధాన్ని, అక్రమ అరెస్టులను ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల అక్రమ అరెస్టును ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం భూములు ఇవ్వబోమని గ్రామస్తులు పోరాడుతుండగా ప్రభుత్వం రైతులను భయపెట్టి, మభ్యపెట్టి భూములు ఏదోఒకరంగా లాక్కునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఆయన ఖండించారు. తక్షణం నిర్బంధాన్ని ఆపి గ్రామ సభ తీర్మానాన్ని గౌరవించి భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉలవపాడు మండలం యావత్తు 30 పోలీసు యాక్టు పెట్టి ఊరుచుట్టూ పోలీసు పోస్టులు ఏర్పాటు చేసి గ్రామాన్ని నిర్బంధించారని తెలిపారు. రైతు నాయకులపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని, ఎవరూ లోపలికి రాకుండా, ఏ విధమైన సమావేశాలూ పెట్టుకోకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. అక్రమంగా భూములు స్వాధీనం చేసుకోవాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని విరమించుకోకపోతే మరింత తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రైతు సంఘం ఖండన

కరేడులో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల అరెస్టును ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి తీవ్రంగా ఖండించారు. భూసేకరణను రైతులు ముక్తకంఠంతో వ్యతి రేకిస్తున్నా ప్రభుత్వం ఎందుకు అంతపట్టుదలగా వ్యవహరిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. నిరంకుశ, అప్రజాస్వామిక పద్ధతులు మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఉత్తరకాశీలో మెరుపు వరదలు

(మొదటిపేజీ తరువాయి)

హోటళ్లు, ఇళ్లు, మార్కెట్లు అంతా కొట్టుకుపోతున్న దృశ్యాలు వీడియోలలో కనిపించాయి.

సుఖ్‌టాప్ వద్ద మరో క్లౌడ్ బరస్ట్ !

ధరాలీ గ్రామంపై వరద ముంచెత్తిన కొద్ది గంటల వ్యవధిలోనే మరో పర్యాటక ప్రాంతమైన సుఖ్‌టాప్ వద్ద కూడా ఇటువంటి పరిస్థితే నెలకొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇక్కడ చోటు చేసుకున్న నష్టంపై పూర్తి వివరాలు తెలియలేదు. దారాలికి సమీపంలోని హర్సిల్ హెలీప్యాడ్ చుట్టుపక్కల ప్రాంతంలో భారీగా వినాశనం చోటు చేసుకుంది. హర్సిల్ ప్రాంతం కూడా ప్రముఖ పర్యాటక ప్రాంతమే, ఇక్కడే ఆర్మీ, ఐటిబిపి (ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసులు) శిబిరాలు కూడా వున్నాయి

2013 కన్నా పెద్దది..!

2013లో సంభవించిన వరద ఉధృతి కన్నా ఇది చాలా పెద్దదని తెహ్రీ గర్వాల్ ఎంపి మాలా రాజ్యలక్ష్మి షా వ్యాఖ్యానించారు. వరద పోటెత్తుతుండగా కొంతమంది స్థానికులు తీసిన వీడియో ఫుటేజీ చూస్తుంటే పెద్ద ఎత్తున బురదతో కూడిన వరద ఒక్కసారిగా గ్రామం మీదకు విరుచుకుపడడం కనిపిస్తోంది. ఈ విపత్తు సంభవించిన ప్రాంతానికి కొంచెం దూరంలో వున్నవారు ఫోన్‌కాల్స్ చేసి తమ వారి గురించి ఆరా తీస్తున్నారు.

మధ్యాహ్నం 1.45గంటల ప్రాంతంలో ఈ ప్రకృతి విపత్తు సంభవించిందని ఉత్తరకాశీ జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య తెలిపారు. దీనివల్ల భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని చెప్పారు.. సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర విపత్తు నిర్వహణా బలగాలతో పాటూ ఆర్మీ, ఐటిబిపి బలగాలు కూడా యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగాయని జిల్లా మేజిస్ట్రేట్ ఆర్య తెలిపారు.

సహాయక చర్యలు

గాలింపు, సహాయక చర్యలు చేపట్టిన తొలి మూడు గంటల్లోనే దాదాపు 37మందిని కాపాడారు. డెహ్రాడూన్‌లో ఆర్మీ పిఆర్‌ఓ లెఫ్టినెంట్ కల్నల్ మనీష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గాయపడినవారికి అవసరమైన చికిత్స కోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని సిద్ధం చేయాల్సిందిగా సమీపంలోని ఆస్పత్రులను కోరినట్లు చెప్పారు. పడకలు, ఆక్సిజన్, మందులు ఇతర అత్యవసరాలతో సిద్ధంగా వుండాల్సిందిగా వైద్య బృందాలను ఆదేశించారు. రాబోయే కొన్ని రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అన్ని పాఠశాలలను రెండు రోజుల పాటు మూసివేసింది. నదికి సమీపంలో వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు లౌడ్‌స్పీకర్లను, సైరన్లను ఉపయోగించాల్సిందిగా జిల్లా విపత్తు నిర్వహణా అధికారులను ఆదేశించారు. సమీప ప్రాంతాల ప్రజలను ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. తదుపరి నోటీసులు జారీ చేసేవరకు ఉత్తరకాశీలో ట్రెక్కింగ్ అనుమతులు రద్దయ్యాయి.

సిఎంతో మాట్లాడిన ప్రధాని, హోం మంత్రి

మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సంతాపాన్ని తెలియజేశారు. సత్వరమే సహాయక, పునరావాస చర్యలను చేపట్టాల్సిందిగా ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా వుండాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా ముఖ్యమంత్రితో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. మొత్తంగా జరుగుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. సహాయక చర్యలకు అవసరమైన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.

నగదు బదిలీకి అడుగులు!

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల మందికి రేషన్ సరుకులు అందజేస్తున్నామని, దీపం-2 పథకంలో భాగంగా కోటి మందికి లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. అదనంగా ఆర్థిక భారం పడుతున్నప్పటికీ రేషన్ దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పౌరసరఫరాల శాఖ జిసిసితో అనుసంధానమవుతుందని, వివిధ గిరిజన ఉత్పత్తులను 29,500 రేషన్ దుకాణాల ద్వారా తక్కువ ధరకు విక్రయిస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పిస్తామన్నారు.

25న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. ఇప్పటికే రేషన్ తీసుకుంటున్న అందరితోపాటు కొత్తవారికీ ఈ కార్డులు అందజేస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, విశాఖ జెసి కె.మయూర్ అశోక్, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు, జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి పాల్గొన్నారు.



కష్టం ఒకరిది దర్జా మరొకరిది..




విశ్వనాథపాలెం ఊరి చివర ఉన్న అడవిలో దొరికే రకరకాల పళ్ళు, దుంపలను రాజయ్య నగరంలో అమ్ముతుంటాడు. తేనె కూడా అమ్ముతాడు. ఓరోజు పొద్దున్నే అడవికి బయల్దేరుతుండగా అతని మనవడు బంటి వెంటపడ్డాడు. ఇద్దరూ కలిసి అడవికి వెళ్లారు.

అడవిలో ఓ మామిడి చెట్టు దగ్గర రాజయ్యకి తేనె తుట్టు కనిపించింది. వెంటనే తన భుజం మీద ఉన్న కంబళి మనవడికి ఇచ్చి, 'బంటి నేను ఎండు పుల్లలు పేర్చి, ఆ పైన కనపడే తేనె పట్టుకి మంట పెడతాను .అప్పుడు ఆ తేనెటీగలు చల్లాచెదురుగా పోతాయి. అప్పుడు మనం తేనె తీసుకోవచ్చు. సరేనా!' అన్నాడు.

రాజయ్య పుల్లలు పేర్చి, మంట పెట్టి, మనవడు కప్పుకున్న కంబళిలోకి వచ్చేసాడు. కాసేపటికి, బయటికి వెళ్లి తేనెతుట్టుని తీసుకుని బుట్టలో వేశాడు. దానివైపు వింతగా చూస్తున్న బంటి, రాజయ్యతో 'తాత ఈ పట్టులో తేనె ఉంటుంది కదా! తేనెటీగలు ఎంతో కష్టపడి ఈ తేనెను దాచుకున్నాయి. నువ్వు ఆ తేనే అంతా పిండేశావు. ఇప్పుడవి ఏడుస్తాయి కదా!' అని అమాయకంగా అడిగాడు.

అప్పుడు రాజయ్య బంటిని దగ్గరికి తీసుకుని, 'నాయనా బంటి! ఈ తేనె పట్టు ఇలా తయారవ్వటానికి కొన్ని వేల తేనెటీగలు చాలా కష్టపడతాయి నిజమే! కానీ అవి తమ నాయకురాలుగా ఎన్నుకున్న రాణి ఈగ మాటని గుడ్డిగా అనుసరిస్తాయి. చాకిరీ చేస్తాయి. సేకరించిన తేనెని అవి తాగకుండా కూడపెడతాయి. ఆ రాణీ ఈగ మాత్రం, దర్జాగా తేనె తాగుతుంది. ఇవన్నీ గుడ్డిగా రాణి ఈగ అధికారాన్ని సహించడమే కాకుండా, తాము తినకుండా గొడ్డు చాకిరి చేస్తాయి. చెడ్డవారిని గుడ్డిగా అనుసరిస్తే ఫలితం ఇలానే ఉంటుంది. మనం కాకపోయినా ఇంకొకరు ఈ తేనెను తీసుకుంటారు. కానీ ఎన్నాళ్ళైనా, కూడపెట్టిన ఈగలు మాత్రం తేనెను తాగలేవు. కష్టం ఒకరిది.. దర్జా మరొకరిది' అని చెప్పి తేనే పట్టును తీసుకుని, మనవడితో సహా ఇంటి దారి పట్టాడు రాజయ్య.

– శశి, అజ్జమూరు,
9553809850



లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ బాక్సులో ఉన్న రకరకాల బొమ్మలను ఒక్కొక్కటిగా లెక్కపెట్టండి. ఏవి ఎన్ని ఉన్నాయో పక్కనే ఉన్న బాక్సులో వేసి మొత్తం సంఖ్య, ఇచ్చిన సమాధానానికి సరిపోయిందో లేదో చూడండి.

నేను గీసిన బొమ్మ





ఎస్.సఫియా బతూల్,
5వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
ఎన్ఆర్ పేట, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

మీ కోసం

గ్యాస్ స్టవ్ కొత్తదానిలా మెరవాలంటే నిమ్మకాయ తొక్కలను ఉడికించి ఆ నీటిలో స్పాంజిని ముంచి తుడవాలి.



JEEVANA జీవన the family

కార్నియా సమస్యపై అశ్రద్ధ వద్దు..

కంటి సమస్యల్లో ఒకటైన కార్నియల్ బ్లైండ్‌నెస్ ఒకప్పుడు వృద్ధాప్య సమస్యల్లో ఒకటి. అయితే ఇటీవల చేసిన ఓ అధ్యయనంలో ఈ సమస్య ఇప్పుడు యువతలో ఎక్కువగా కనిపిస్తోంది. ఢిల్లీలో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ కార్నియా అండ్ కెరాటో-రిఫ్రాక్టివ్ సర్జన్స్(ఐఎస్‌సికెఆర్ఎస్) మీట్ 2025లో ఇటీవల సమర్పించిన డేటా ప్రకారం దేశవ్యాప్తంగా టీనేజర్లు, యువకులలో ఈ కేసులలో గణనీయమైన స్థాయిలో పెరిగాయి.



ఐఎస్‌సికెఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ సిన్హా 30 ఏళ్లలోపు వ్యక్తులలో కొత్త కార్నియల్ బ్లైండ్‌నెస్ కేసుల్లో గణనీయమైన నిష్పత్తి కనిపించిందని వెల్లడించారు.

చికిత్స చేయని ఇన్ఫెక్షన్లు, గాయాలు, తగినంత అవగాహన లేకపోవడం వంటి నివారించగల కారణాల వల్లనే ఈ పెరుగుదల ఏర్పడిందని కూడా ఆయన పేర్కొన్నారు, కార్నియల్ బ్లైండ్‌నెస్ అంటే ఇది తిరిగి పొందలేని అంధత్వానికి దారితీసే సమస్య. సాధారణంగా ఏదేని గాయం, ఇన్ఫెక్షన్ లేదా పోషకాహార లోపాల కారణంగా కార్నియా మసకబారుతుంది.

దేశంలో ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం కార్నియల్ అపారదర్శకతలు మన దేశంలో అంధత్వానికి రెండవ ప్రధాన కారణంగా ఉంటున్నాయి. ప్రతి సంవత్సరం, దేశంలో 20 వేల నుండి 25 వేల కొత్త కేసులు కనిపిస్తున్నాయి. ఇవి క్రమంగా పెరుగుతున్నాయి. వ్యవసాయం, నిర్మాణ రంగం, పారిశ్రామిక రంగం వంటి రంగాల్లో పనిచేసే యువతలో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ పనుల్లో జరిగే ప్రమాదాల వల్ల కంటికి ఏదేని గాయం అయినా వాటిని పెద్దగా పట్టించుకోరు. సాధారణ గాయాలుగా పరిగణించే ఇవి తరచూ జరుగుతుండడం, వాటికి చికిత్స చేయకపోవడం లేదా ఇంట్లోనే సొంత వైద్యం చేసుకోవడం ఫలితంగా కంటి ఇన్ఫెక్షన్లు, మచ్చలు ఏర్పడతాయి.

కొన్ని ప్రాంతాలలో నిరంతర విటమిన్ ఎ లోపం పిల్లలు, కౌమారదశలో ఉన్నవారిపై తీవ్రమైన కార్నియల్ నష్టానికి దారి తీస్తోంది. ప్రజా అవగాహన లోపించడం, ఆలస్యమైన వైద్యం, గ్రామీణ ప్రాంతాలలో నిపుణుల కొరత కారణంగా ఈ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

నిపుణులు ఏం చెప్పారంటే..

సర్ గంగా రామ్ హాస్పిటల్, ఢిల్లీ ఐ సెంటర్‌కు చెందిన డాక్టర్ ఇకెడా లాల్ యువతలో కార్నియల్ అంధత్వాన్ని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా పేర్కొంటున్నారు. ప్రభుత్వ పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతని ఆయన నొక్కి చెబుతున్నారు. శిక్షణ పొందిన సర్జన్ల కొరత, తగినంత పరికరాలు లేని కంటి బ్యాంకుల కారణంగా భారతదేశం ఏటా అవసరమైన లక్ష కంటే ఎక్కువ కార్నియల్ మార్పిడిలో దాదాపు 40 వేలు మాత్రమే చేయగలదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఐఎస్‌సికెఆర్ఎస్ సమావేశం మౌలిక సదుపాయాలను విస్తరించడం, అదనపు మానవశక్తికి శిక్షణ ఇవ్వడం, ప్రజల్లో నేత్రదాన అవగాహనను పెంచాల్సిన అవసరాన్ని హైలైట్ చేసింది. ముఖ్యంగా గ్రామీణ, పాఠశాల ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని చెప్పింది. ఈ చర్యల ద్వారా ముందస్తు గుర్తింపు సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే పట్టణ-గ్రామీణ అంతరాలను తగ్గించేలా, టెలి-ఆప్తాల్మాలజీ, మొబైల్ క్లినిక్‌ల ద్వారా సంరక్షణను విస్తరించాలని సూచించారు.

సమావేశం ఇవి కూడా చెప్పింది..

- ప్రతి ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో కంటి పరిశుభ్రత, గాయాల నివారణపై జాతీయ ప్రచారాలను ప్రారంభించాలి.
- 50 నుండి 100 కొత్త కంటి బ్యాంకులను ఏర్పాటు చేయాలి.
- 1,000 మంది కార్నియల్ నిపుణులకు శిక్షణ ఇవ్వాలి.
- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు పరస్పర సహకారంతో ఈ సమస్యపై శ్రద్ధ పెట్టాలి.
- పాఠశాల స్క్రీనింగ్‌ను బలోపేతం చేయాలి.
- అధిక ప్రమాదకర రంగాలలో రక్షణ పరికరాల పంపిణీ చేయాలి.
- పోషకాహారం, సత్వర చికిత్స గురించి ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచాలి.



బొప్పాయి గింజలు.. బోలెడు ప్రయోజనాలు..

బొప్పాయి విత్తనాలు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు.

జలుబు, ఫ్లూ నుండి రక్షణ :

బొప్పాయి గింజల్లోని పాలీఫెనాల్స్, ఫ్లేవలోయిడ్స్ వంటి యాంటీ-ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ప్రభావాలను తగ్గిస్తాయి. ఫలితంగా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జలుబు, ఫ్లూ వంటి అనేక వ్యాధుల ప్రమాదం నుండి రక్షిస్తుంది.

కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది :

బొప్పాయి గింజలు కొవ్వు ఆమ్లాలను కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ధమనులలో ఫలకం తగ్గినప్పుడు, రక్తపోటు తగ్గుతుంది. దీంతో గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు.

బరువు తగ్గడం :

బొప్పాయి గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

బొప్పాయి గింజలను ఎలా తీసుకోవాలి?

విత్తనాలను నీటిలో కడిగి, ఎండలో బాగా ఆరబెట్టాలి. బాగా ఎండిన గింజలను గ్రైండ్ చేసి పొడి చేసుకోవాలి. ఈ పొడిని మిల్క్ షేక్, స్వీట్స్, జ్యూస్ మొదలైన వాటిలో కలపవచ్చు. తీపి పదార్థాలతో కలపడం వల్ల సహజంగా గింజలకు ఉండే చేదు రుచి పోతుంది. దీంతో రుచిగా ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.



ఉల్లిరసంతో పట్టు కుచ్చు లాంటి జుట్టు

జుట్టు సంరక్షణలో ఉల్లిరసం కీలక భూమిక పోషిస్తుంది. ఉల్లిపాయ రసాన్ని జుట్టుపై మర్దనా చేయడం వల్ల జుట్టు పెరగడంతో పాటు చుండ్రు తొలగిపోతుందని చాలా మంది నమ్ముతారు. అయితే, సరైన పద్ధతిలో మర్దనా చేస్తేనే ఫలితం ఉంటుంది.

- ముందుగా ఉల్లిపాయను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- వాటిని బ్లెండర్‌లో వేసి పేస్ట్‌లా చేయాలి.
- ఈ ముద్దను ఒక గుడ్డలో వేసి రసాన్ని తీయాలి.
- ఇప్పుడు ఆ ఉల్లిపాయ రసాన్ని తలకు, జుట్టు మూలాలకు అప్లై చేయాలి.
- ఉల్లిపాయ రసాన్ని అప్లై చేసిన తర్వాత కొన్ని నిమిషాల పాటు తేలికపాటి చేతులతో తలకు మసాజ్ చేయాలి.
- అరగంట తర్వాత తేలికపాటి షాంపూతో తలను కడగాలి.

ప్రయోజనాలు..

జుట్టును బలంగా మారుస్తుంది

ఉల్లిరసంలో ఉండే సల్ఫర్ జుట్టు పెరుగుదలకు అవసరమైన కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. జుట్టు మీద ఉల్లిపాయ రసాన్ని క్రమం తప్పకుండా అప్లై చేయడం వల్ల హెయిర్ ఫోలికల్స్ ఉత్తేజితమవుతాయి. ఇవి జుట్టు వేగంగా పెరిగేందుకు సహాయపడతాయి.

చుండ్రుని తగ్గిస్తుంది

ఉల్లిపాయ రసంలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చుండ్రు, స్కాల్ప్ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో సహాయపడతాయి.

రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది

ఉల్లిపాయ రసంలో రక్త ప్రసరణకు సహాయపడే సమ్మేళనాలు ఉంటాయి. దీనివల్ల రక్త ప్రసరణ సులభమై జుట్టు పెరుగుదల మెరుగవుతుంది.

కార్మికుల డిమాండ్లకు నిర్మాతల మండలి నో

నిబంధనల ప్రకారం వేతనాలు కోరుతున్న కార్మికులు

వేతనాలు పెంచాలంటూ సినీ కార్మికులు చేస్తున్న సమ్మె వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సినీ కార్మికుల సమ్మె డిమాండ్లకు నిర్మాతల మండలి నో చెప్పింది. యూనియన్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రతిభ ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రతిభ కలిగిన వారికి మంచి అవకాశాలు కల్పిస్తామంటూ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనకు అధికారిక వెబ్‌సైటును, మెయిల్ ఐడీని జత చేసింది.

ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు సోమవారం నుంచి సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. వర్కర్లకు 30 శాతం వేతనం పెంచిన నిర్మాతల సినిమాలకు పనిచేసి, ఇవ్వని వారి సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని కార్మికులు నిర్ణయం తీసుకున్నారు. దీనిపైన చర్చించిన నిర్మాతల మండలి పైవిధంగా నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ ఈవిధంగా మాట్లాడారు.

'పేద సినీ కార్మికులకు మేము వ్యతిరేకం కాదు. వారికి ఎప్పుడూ అండగానే ఉంటాం. ఫిలిం ఛాంబర్‌తోనే 'మా' అసోసియేషన్ కలిసి వెళ్తుందని మంచి విష్ణు చెప్పారు. లేబర్ యాక్ట్ ప్రకారం నిర్మాతలు ఒక్కో కార్మికుడికి భారీగానే వేతనం చెల్లిస్తున్నారు. ఐటీ ఎంప్లాయిస్ కన్నా యూనియన్ కార్మికులకు జీతాలు ఎక్కువ ఉన్నాయి. ఏడెనిమిది లక్షల రూపాయలు చెల్లిస్తేనే యూనియన్‌లో సభ్యత్వం ఇస్తున్నారు. మా కార్మికులతోనే పని చేయాలి అని యూనియన్ వాళ్ళు చెప్పడం తప్పు. కాంపిటేటివ్ కమిషన్ ఆఫ్ ఇండియా రూల్స్‌ని కూడా ధిక్కరించి సమ్మెకు పిలుపు నిచ్చారు. ఫెడరేషన్ వాళ్ళవి ఏకపక్ష నిర్ణయాలు. మేం చట్ట పరంగా న్యాయంగా వెళ్తున్నాం. నిర్మాతల పరిస్థితే బాగోలేదు. ఇలాంటి సమయంలో సమ్మె చేయడం సరికాదు. కార్మికులు కూడా మాతో కలిసి వస్తారని ఆశిస్తున్నాం. స్వార్థ పూరిత విధానాలతో కాకుండా అందరం ఒక కుటుంబం లాగా కలసి చర్చించుకుందాం' అని అన్నారు.



నిబంధనల ప్రకారం కార్మికులు రావాల్సిన వేతనాల వివరాలు ఇవి..

తెలుగు సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు గతంలో నిర్మాతల మండలి ఇచ్చిన హామీమేరకు 30 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం మూడేళ్ల తర్వాత జూన్ 30కే ఈ పెంపు వర్తింపజేయాల్సి వుంది.

అయితే గత నాలుగు నెలలుగా తాము డిమాండ్ల గురించి తెలియజేస్తున్నా నిర్మాతల మండలి పట్టించుకోకపోవటం లేదని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికే అనేక దఫాలుగా సమావేశాలు నిర్వహించిన నిర్మాతల మండలి నుంచి సానుకూల స్పందన లేదని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆలిండియా ఫిలిం ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్-యుఎన్ఐ-ఎంఐఐ అనుబంధం) ఆధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్) ఆవేదన వ్యక్తంచేశారు.

కార్మికుల తరపున ప్రాతినిధ్యం వహించే 13 యూనియన్లతోపాటుగా 24 క్రాఫ్ట్‌ల్లో పనిచేసే వారికి వేతన పెంపుదల వర్తిస్తుంది. 30 శాతం పెంచిన నిర్మాతల షూటింగులకు మాత్రమే కార్మికులు హాజరు కావాలని ఆదివారం నాయకత్వం ప్రకటన విడుదల చేసింది. గత కొన్ని రోజులుగా వేతనాల విషయంపై ఫిల్మ్ ఫెడరేషన్ ఫిల్మ్ ఛాంబర్‌లో నాలుగు దఫాలుగా చర్చలు జరిపింది.



ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది

ఎస్‌జె శివ

హాస్యనటుడు ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన 'బకాసుర రెస్టారెంట్' చిత్రం ఆగస్టు 8న విడుదలకి సిద్ధంగా ఉంది. ఎస్జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. సినిమా విడుదల సందర్భంగా చిత్ర దర్శకుడు ఎస్జే శివ చిత్ర సంగతులను ఓ ఇంటర్వ్యూలో ముచ్చటించారు. 'బకాసుర రెస్టారెంట్' యమలీల, ఘటోత్కచుడులా ఆడియన్స్ థ్రిల్‌కి గురి చేస్తుంది. రెస్టారెంట్ పెట్టాలనుకునే 5గురు ఫ్రెండ్స్ జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే వారు తిప్పలు ఎలా ఉంటాయి? వారు రెస్టారెంట్ పెట్టగలిగారా లేదా అనేది ఈ సినిమా కథ. థియేటర్‌కి వచ్చే ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే మా లక్ష్యం. ఇదొక క్లీన్ కామెడీ ఎంటర్ టైనర్. అందరూ ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రం. గతంలో వచ్చిన 'యమలీల, ఘటోత్కచుడు'లా ఆడియన్స్ థ్రిల్ ఫీలయ్యే కథ. ఎస్వీసీ లాంటి సంస్థ ఈ సినిమాను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. క్వాలిటీగా సినిమా తీశాం. సినిమా తీయడం చాలా కష్టం. కానీ ఇక్కడ ఎవరూ కథ ఏమిటి? ఎలా ఉంటుంది అని అడగటం లేదు. ప్యాడింగ్ ఎవరు? ఎంత ఖర్చు పెట్టారు? ఎంత ఆశిస్తున్నారని అడుగుతున్నారు. సినిమా అనేది ఎంటర్‌టైన్మెంట్. కానీ దాని గురించి తప్ప అన్నీ అడగటం ఆశ్చర్యం కలుగుతోంది. నాకు విఠలాచార్య గారి సినిమాలు అంటే ఇష్టం. ఆ తరహా కథలతో సినిమాలు తీయాలని వుంది. ప్రస్తుతం నా వద్ద ఓ ఫ్యాక్షన్ యాక్షన్ ఎంటర్టైనర్ కథ ఉంది. త్వరలోనే దానికి సంబంధించిన వివరాలు తెలియచేస్తాం. ఇక మా ఎస్జే బ్యానర్లో కొత్త దర్శకులకు మాత్రమే అవకాశం. కాబట్టి నా తదుపరి చిత్రం ఇందులో ఉండదు. దర్శకుడిగా చాలా తక్కువ వర్కింగ్ డేస్‌లో సినిమాలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నాను. మా 'బకాసుర రెస్టారెంట్'ను ఐదు కోట్లతో తీసినా 12 కోట్ల అవుట్పుట్ కనిపిస్తుంది' అని అన్నారు.

ఇంగ్లండ్ టూర్ దిగ్విజయం

- **టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీలో పలు రికార్డులు నమోదు**



ఇంగ్లండ్-భారత్ జట్ల మధ్య జరిగిన టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీలో పలు రికార్డులు నమోదయ్యాయి. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ఒక దశలో 1-2తో వెనుకబడినా.. సిరీస్‌ను సమం చేసిన తీరు వర్ణణాతీతం. తొలి మూడు టెస్ట్‌లు ముగిసేసరికే సిరీస్ ఓటమి కోరల్లో నిలిచిన భారత్.. నాల్గో టెస్ట్‌ను డ్రా చేయడంతోపాటు ఐదో టెస్ట్‌ను విజయంతో ముగించింది. దీంతో భారతజట్టు సాధించిన చిరస్మణీయ విజయాల్లో ఒకటిగా ఇంగ్లండ్ పర్యటన సుదీర్ఘకాలం నిలిచిపోనుంది. ఈ క్రమంలోనే ఇరుజట్ల ఆటగాళ్లు పలు రికార్డులను బ్రేక్ చేశారు. శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్, జైస్వాల్, జడేజా, పంత్‌తో పాటు ముఖ్యంగా హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్, బెన్ స్టోక్స్ ఈ జాబితాలో నిలిచారు.

నమోదైన రికార్డుల్లో కొన్ని...

- ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ 754 పరుగులు చేసి సునీల్ గవాస్కర్(732పరుగులు, వెస్టిండీస్‌పై 1978)లో పేర ఉన్న రికార్డును తిరగరాసాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ డాన్ బ్రాడ్‌మన్(810పరుగులు; 1936-37) రికార్డును బ్రేక్ చేయలేకపోయాడు. గిల్(754) టెస్ట్ సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సునీల్ గవాస్కర్ (వెస్టిండీస్‌పై 774; 1970-71) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. కెప్టెన్‌గా అరంగేట్రం టెస్ట్‌లోనే సెంచరీ కొట్టిన ఐదో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రమే. బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో 269 (డబుల్ సెంచరీ) కొట్టిన ఐదో భారత కెప్టెన్‌గా గిల నిలిచాడు. అంతకుముందు పటౌడీ, సచిన్, ధోనీ, కోహ్లి మాత్రమే కెప్టెన్లుగా డబుల్ సెంచరీలు కొట్టారు. బర్మింగ్‌హామ్‌లో 269, 161పరుగులతో నాటౌట్‌గా నిలిచిన గిల్.. కోహ్లి(293), గవాస్కర్(344) పేర ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు.
- లార్డ్స్ పిచ్‌పై ఐదు వికెట్లు తీసిన జస్ప్రీత్ బుమ్రా.. లాలా అమర్‌నాథ్, కపిల్‌దేవ్, చంద్రశేఖర్, భువనేశ్వర్ కుమార్, వినోద్ మన్కడ్, చేతన్ శర్మ, ఇషాంత్ వర్మ, మహ్మద్ నిస్సార్, సురేంద్ర నాథ్ సరసన నిలిచాడు. ఈ పిచ్‌పై సెంచరీ కొట్టిన భారత ఓపెనర్‌గా కెఎల్ రాహుల్.. ఇంగ్లండ్‌పై అత్యధిక సెంచరీలు కొట్టిన ఓపెనర్‌గా రికార్డు సృష్టించాడు.
- టెస్టుల్లో భారతజట్టు 6పరుగుల తేడాతో గెలవడం ఇదే తొలిసారి. 2004లో ముంబయిలో ఆస్ట్రేలియాపై 13 పరుగుల తేడాతో గెలిచింది. ఒక టెస్ట్ సిరీస్‌లో 500కు పైగా పరుగులు ముగ్గురు భారత బ్యాటర్లు కొట్టడం ఇదే తొలిసారి. గిల్(754), కెఎల్ రాహుల్(532), జడేజా(516) రాణించారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్(8సెంచరీలు) లీడ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు కొట్టి ధోనీ రికార్డును బ్రేక్ చేయగా.. ధోనీ పేరనున్న (ఆరు సెంచరీలు) రికార్డును బ్రేక్ చేశాడు. ఇంగ్లండ్‌పై అత్యధికసార్లు ఐదు వికెట్లు సాధించిన రికార్డు కపిల్‌దేవ్ పేర(12)ను బుమ్రా బ్రేక్ చేశాడు.
- ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన మహ్మద్ సిరాజ్ (23వికెట్లు) జస్ప్రీత్ బుమ్రా(2021-22)ను సమం చేశాడు. జస్ప్రీత్ బుమ్రా 14 వికెట్లు తీసినా.. ఓవరాల్‌గా ఇంగ్లండ్‌పై అత్యధిక వికెట్లు తీసిన ఇషాంత్ శర్మ(51) ఆల్‌టైమ్ ఇండియన్ రికార్డును సమం చేశాడు. ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక ఓవర్లు బౌల్ చేసిన పేసర్ల జాబితాలో సిరాజ్ రెండోస్థానంలో నిలిచాడు. బుమ్రా(187ఓవర్లు; ఇంగ్లండ్‌పై 2021-22) రికార్డును సిరాజ్(185.3ఓవర్లు) బ్రేక్ చేయలేకపోయాడు.
- ఎడ్జ్‌బాస్టన్‌లో భారతజట్టు 336 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. దీంతో 2019లో (318 పరుగుల తేడాతో) గెలిచిన రికార్డు బ్రేక్ అయ్యింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ సిరీలో భారత్ 3,809 పరుగులు చేసింది. ఇది గతంలో 3,270 పరుగులుగా ఉంది. ఇక ఆస్ట్రేలియా 3877పరుగులు(1989) యాషెస్ సిరీస్ రికార్డు బ్రేక్ కాలేదు. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్-ఇంగ్లండ్ జట్లు కలిపి మొత్తం 7,187పరుగులు చేశాయి. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో రెండో అత్యుత్తమ స్కోర్. 1993లో ఆరు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో(7,221 పరుగులు) నమోదయ్యాయి.
- టెస్టుల్లో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రూట్(13,543పరుగులు) నిలిచాడు. ఈ క్రమంలో ద్రావిడ్(13,288), కల్లిస్(13,289), పాంటింగ్(13,378) బ్యాటర్లను అధిగమించాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత దిగ్గజ బ్యాటర సచిన్ టెండూల్కర్(15,921పరుగులు) రికార్డు పదిలంగానే ఉంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 7వేల పరుగులు, 200 వికెట్లు తీసిన మూడో ఆటగాడు బెన్ స్టోక్స్ మాత్రమే. అంతకుముందు కల్లిస్(దక్షిణాఫ్రికా), డ్యారీ సోబర్స్ మాత్రమే ఈ ఫీట్‌ను అందుకున్నారు.

– స్పోర్ట్స్ డెస్క్

మూడోస్థానానికి టీమిండియా..!

దుబాయ్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసిన టీమిండియా... 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. కొత్త డబ్ల్యుటిసి సైకిల్ టీమిండియాకు ఇదే తొలి సిరీస్. రెడ్ బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు గిల్ నాయకత్వంలో మొదటిసారి టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లి సిరీస్‌ను గెలుచుకోలేకపోయినా.. చివరిదైన ఓవల్ టెస్టులో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. ఈ విజయం ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా మూడోస్థానానికి చేరుకుంది. ఓవల్ టెస్ట్‌కు ముందు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో ఇంగ్లండ్ నిలిచింది. భారత్ ఐదు మ్యాచుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 28 పాయింట్లతో పాటు 46.67శాతం పర్సంటేజ్‌ను కలిగి ఉంది. ఇక ఆస్ట్రేలియా మూడు మ్యాచుల్లో మూడు విజయాలను నమోదు చేసుకొని టాప్‌లో నిలువగా.. శ్రీలంక జట్టు రెండు టెస్టుల్లో ఒకటి గెలిచి మరొకటి డ్రాగా ముగించి రెండో స్థానంలో ఉంది. ఇక ఇంగ్లండ్ ఐదు మ్యాచుల్లో రెండింట్లో గెలిచి.. రెండింట్లో ఓడిపోగా.. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకొని నాల్గో స్థానంలో నిలిచింది.

తొలిరౌండ్‌లోనే ఓడిన వైశాలి

మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: మహిళల స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి నిరాశపరిచింది. అమెరికాకు చెందిన ఎలైసీ లీతో సోమవారం జరిగిన తొలిరౌండ్ గేమ్‌లోనే అనూహ్యంగా ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో వైశాలి 6-8పాయింట్ల తేడాతో లీ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. వైశాలి తొలుత 5+1తో ఆధిక్యతలో 3.5-0.5పాయింట్లతో ఆధిక్యత నిలిచింది. ఈ క్రమంలో లీ 3+1తో పుంజుకొని మ్యాచ్‌ను 3-2పాయింట్లతో ముగించి విజేతగా నిలిచింది. ఇక ఫిడే మహిళల ప్రపంచకప్ టైటిల్ విజేత దివ్య దేశ్‌ముఖ్ 11న జరిగే తొలిరౌండ్ గేమ్‌లో చైనా గ్రాండ్‌మాస్టర్ లీ-టింగ్జీతో తలపడనుంది. సింగిల్స్ విభాగంలో 16మంది గ్రాండ్‌మాస్టర్లు తలపడుతుండగా.. తొలిరౌండ్‌లో గెలిచిన 8మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68